ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

ఆదివారం 19 మే 2024

పట్టాలిచ్చారు స్థలం చూపించడం లేదు..



జగనన్న ఇస్తున్న ఇంటి స్థలం పట్టా అని అధికారులు పట్టాలిచ్చారు. పట్టాలిచ్చారని ఇంటి నిర్మాణం చేసుకుంటాం. స్థలం చూపించండి అని అడిగితే ఎవరూ పట్టించుకోవడం లేదు. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్న నేడు, రేపు అంటూ కాలయాపన చేస్తున్నారు. మాకు స్థలం చూపిస్తే ఇంటి నిర్మాణం చేసుకుంటాం. పట్టాలు ఇచ్చి నాలుగు సంవత్సరాలు కావస్తోంది. ఇప్పటి వరకు స్థలం చూపించలేదు.

- చింతకాయల నిర్మల, లబ్ధిదారు

ఇవేనా ఊళ్లు.. నమ్మేనా జనం కళ్లు..!

- ఇళ్లు నిర్మించేస్తామని చెప్పి చేతులెత్తేసిన ప్రభుత్వం
- అనువుగాని చోట ఇచ్చి కట్టాలని ఒత్తిడి
- కనీస వసతులు కరువు




స్థలం చూపించకపోయినా పట్టా మంజూరు చేసిన ప్రభుత్వం

సుండుపల్లె, మే 18: జగనన్న కాలనీల పేరుతో వైసీపీ ప్రభుత్వం చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ఎంతో మేలు చేస్తున్నాం అన్నట్లు లబ్ధిదారులను ఎంపిక చేసి స్థలాలు చూపినా ప్రతి దశలో ప్రభుత్వం వ్యూహాత్మకంగానే వ్యవహరించింది. అంతా ఓట్ల ధ్యాస తప్ప ఒకటిన్నర సెంటు స్థలాల్లో గృహాల నిర్మాణం పూర్తి చేసే ఆలోచనే కనిపించలేదు. పైగా నగర శివారు ప్రాంతాల్లో ఆ స్థలాలు కేటాయించారు. సుండుపల్లె మండల వ్యాప్తంగా జగనన్న లేఅవుట్లలో పేదలకు, అధికార పార్టీ నాయకులు సిఫార్సు చేసిన వారికి పక్కాగృహాలు మంజూరు చేశారు. నిరుపేద లబ్ధిదారులు ఆర్థిక స్థోమత లేక నిర్మించుకోలేకపోయిన వారిపై అధికారుల ఒత్తిళ్లు పెరగడంతో ఇళ్లు కట్టుకునే పరిస్థితి లేక స్థలాలు అమ్మేసుకుంటున్నారు. కొన్ని లేఅవుట్లలో అనర్హులకు వైసీపీ నాయకులు పట్టాలు ఇప్పించారు. అర్హులకు మండల కేంద్రానికి దూరంగా ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం లేని విధంగా గుట్టల కింద, బండలపైన, గుట్టలను చదును చేసి ఇంటి స్థలాలను కేటాయించారు. అలాంటి చోట ఇళ్లు ఏ విధంగా కట్టుకోవాలని లబ్ధిదారులు వాపోతున్నారు. నిరుపేదలను గుర్తించి ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం అని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి మాటలు ఆచరణలో మాత్రం అర్హులకు ఊరికి దూరంగా, అనర్హులకు వైసీపీ నాయకులకు మండల కేంద్రంలో ఇంటి పట్టాలు కేటాయించడం, మండల వ్యాప్తంగా తీవ్ర విమర్శలకు దారితీసింది.

కొండను చూపి జగనన్న కాలనీ అంటే ఎలా..?

మడితాడు గ్రామ పంచాయతీ జీకే రాచపల్లెకు దూరంగా గుట్ట కింది భాగంలో సర్వే నెంబర్ 637లో 23 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించి ఇంటి పట్టాలను కేటాయించారు. అయితే రెండు గుట్టలకు మధ్యలో ఇంటి నిర్మాణానికి ఎటువంటి అవకాశం లేని చోట ప్లాట్లు వేసి పట్టాలు పంపిణీ చేశారు. వెళ్లేందుకు కనీసం దారి కూడా లేదు. పట్టాలు పంపిణీ చేసి మూడు సంవత్సరాలు అయినా ఇప్పటి వరకు కనీసం ఇంటి నిర్మాణం ప్రారంభించే పనిని కూడా లబ్ధిదారులు చేయలేదు. అంటే ఆ స్థలం ఇంటి నిర్మాణానికి ఎంత అనువైనదో అర్థమవుతుంది. ఇంటి స్థలం ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారే తప్ప ఆ స్థలం ఎందుకూ పనికిరాదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయితే మరోచోట సర్వే నెంబరు 2475 కంచిపాటివాండ్లపల్లె వద్ద సుండుపల్లె మండల కేంద్రానికి చెందిన మైనార్టీలు, దళితులు, ఇతర కులస్తులకు 126మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. అయితే మండల కేంద్రానికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో గుట్టపైన పెద్ద పెద్ద బండరాళ్లు ఉన్న చోట లేఅవుట్‌ను వేశారు. ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఎటువంటి వసతులు లేకపోవడం వలన లబ్ధిదారులు ఎవరూ ఇంటి నిర్మాణానికి మొగ్గు చూపలేదు. చాలా మంది మైనార్టీలకు ఇంటి పట్టాలు ఇవ్వడం



రెండు గుట్టల మధ్య జగనన్న లేఅవుట్ వేసిన దృశ్యం



వసతులు లేక అర్ధాంతరంగా ఆగిపోయిన నిర్మాణాలు

వలన మసీదులకు వెళ్లాలంటే ఎలా వెళ్లాలి. ఒకవేళ ఇంటి నిర్మాణం చేయాలంటే అక్కడ నీటి వసతి ఏం చేయాలి. బస్సు సౌకర్యం లేదు. ఆటో బాడుగకు తీసుకొని వెళ్లాలి. ఆటో బాడుగ 200 రూపాయలు తీసుకుంటున్నారు. అలాంటి చోట మాకు ఇంటి పట్టాలు ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం ఏమిటని మైనార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టాలిచ్చారు.. లేఅవుట్ ఎక్కడన్నా...

జగనన్న కాలనీ కనిపించడం లేదని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పేదవారి సొంతింటి కల నెరవేర్చాలన్న సంకల్పంతో కొంత మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అయితే పట్టాలిచ్చారు గానీ లబ్ధిదారులకు లేఅవుట్ చూపించడం మరిచిపోయారు. సుండుపల్లె మండల కేంద్రంలోని కొంతమంది లబ్ధిదారులకు అధికారులు, పాలకులు ఎంతో ఆర్భాటంతో ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. 52 మంది లబ్ధిదారులకు మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో సర్వే నెంబర్ 1387లో లేఅవుట్ వేసినట్లు పట్టాలు పంపిణీ చేశారు. అక్కడ పచ్చని పంట పొలాలు, వరి, వేరుశనగ సాగు చేసిన పొలాలతో పాటు మామిడి తోటల మధ్యలో గుట్టకింద లేఅవుట్ కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు వెళ్లి స్థలం పరిశీలించకుండానే అధికార పార్టీ నాయకుల మాటే శిరోధార్యంగా భావించి స్థలం లేకపోయినా పత్రాలపైన లేఅవుట్ సిద్ధం చేశారని స్థానిక ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వేరే చోట స్థలం చూపిస్తే ఇంటి నిర్మాణం చేసుకుంటామని లబ్ధిదారులు అధికారులను, పాలకులను అడిగినా ఎటువంటి ఫలితం లేకుండా పోయింది.

మండలమంతా 900 మందే అర్హులు

సుండుపల్లె మండల వ్యాప్తంగా సుమారు 80 వేల మందికిపైగా జనాభా ఉన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో రూరల్ ఏరియాలో అతిపెద్ద మండలం సుండుపల్లె మండలం. అయితే వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ఇంటి నిర్మాణం లేని అర్హులకు ఇంటి స్థలాలను కేటాయిస్తున్నామన్నారు. అయితే 14 గ్రామ పంచాయతీల్లో 228 పల్లెల్లో 900 మంది అర్హులు మాత్రమే ఉండడం ఆశ్చర్యకరంగా ఉంది. మారుమూల మండలం బడుగు, బలహీనవర్గాలు నివసిస్తున్న మండలంలో అర్హులకు ప్రాధాన్యత ఇవ్వకుండా కేవలం 900 మందికి మాత్రమే ఇంటి స్థలాలు మంజూరు చేయడం చూస్తుంటే ఈ ప్రభుత్వం ఏ మేరకు ప్రజలకు మేలు చేస్తుందో అర్థమవుతుందని ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఇంటి స్థలాలు కలిగిన 2200 మందికి ఇంటి నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. వారు అరకొరగా ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఇంటి స్థలాలు పొందిన అర్హులు మాత్రం పెద్దగా ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు మొగ్గు చూపలేదు. దానికి కారణం అనువైన చోట ఇంటి స్థలం ఇవ్వలేదని విమర్శలు ఉన్నాయి. అర్హులను గుర్తించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని స్పష్టంగా తెలుస్తోంది.



పట్టాలిచ్చారు ఇంటి స్థలం చూపించ లేదని నిరసన తెలియ జేస్తున్న లబ్ధిదారులు (ఫైల్‌ఫొటో)

ఘనంగా వాసవీమాత జయంతి



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

మదనపల్లె అర్బన్, మే 18: స్థానిక వాసవీభవన్ వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత జయంతి ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దేవళంవీధిలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో నుంచి ఆర్యవైశ్య మహిళలు శాస్త్రోక్తంగా గంగను తెచ్చి అమ్మవారికి అభిషేకించారు. ఆలయంలో హోమం నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. అనంతరం వాసవీ మాతను ప్రత్యేకంగా అలంకరించి వాసవీమాత జయంత్యుత్సవాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు. అమ్మవారి ఆరాధనతో పాటు అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. ఆలయం వద్ద మదనపల్లె వాసవీక్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఉదయం ఆర్యవైశ్య యువత స్థానిక ఆర్యవైశ్య హాస్టల్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు.సాయంత్రం వాసవీమాత జయంతి సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పుష్పపల్లకిలో పట్టణంలో ప్రత్యేక వాహనంపై ఊరేగింపు చేశారు. ఊరేగింపులో ఆర్యవైశ్యులు సంప్రదాయ దుస్తులు ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనాథ్, అమర్‌నాథ్, ట్రెజరర్ లక్ష్మీదీపక్, వి.వి.కృష్ణారావు, సభ్యులు పాల్గొన్నారు. వాసవీమాత జయంత్యుత్సవాల కార్యక్రమాలను మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్, దేవతా సతీష్, సూరేగిరిధర్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

బ్రహ్మంగారిమఠంలో పోటెత్తిన భక్తులు

- వైభవంగా బ్రహ్మ రథోత్సవం
- గుడి ఉత్సవంలో భక్తులకు దర్శనమిచ్చిన బ్రహ్మంగారు
- దర్శనం కోసం క్యూలైన్లలో వేచిన భక్తులు

బ్రహ్మంగారిమఠం, మే 18: కాలజ్ఞాన కర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు మే నెల 14 తేది నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదో రోజు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ గుడి ఉత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు శనివారం తెల్లవారుజామున బ్రహ్మంగారి నివాసగృహం వీధుల్లో వేకువజామునే వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ, స్వామి మనవరాలు జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారు గ్రామోత్సవంలో ఊరేగారు. భక్తులు దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. రథోత్సవం ముఖ్యమైన దినం కావడంతో భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి దర్శనం కోసం వచ్చిన భక్తులకు దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనర్, ప్రస్తుత ఆలయ ఫిట్ పర్సన్ శంకరబాలాజీ పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేశారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, భోజన వసతి, విశ్రాంతి గదులు, క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారు.

కన్నుల పండువగా రథోత్సవం

ఆరాధన గురుపూజా మహోత్సవాల్లో భాగంగా శనివారం కాలజ్ఞాని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మరథోత్సవంపై ఆలయ మాఢవీధుల గుండా రథాన్ని అశేష జనవాహిని మధ్య, భక్తుల కేరింతల మధ్య జై వీరబ్రహ్మ.. జై గోవిందమాంబ.. నామస్మరణలతో రథోత్సవం మారుమోగింది. ముందుగా బ్రహ్మరథోత్సవాన్ని ప్రారంభించే ముందు పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంతవేంకటేశ్వరస్వామి కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. అనంతరం జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారు, మఠాధిపతి వీరకుమార స్వామి రథానికి పూజలు చేసి రథాన్ని ముందుకు కదిలించారు. దాదాపు రెండుగంటల పాటు రథోత్సవాన్ని ఆలయ మాఢవీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. జిల్లా నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి కూడా భక్తులు పాల్గొని రథోత్సవాన్ని తిలకించారు. గత కొన్నిరోజుల నుంచి ఎండవేడిమి ఎక్కువగా ఉంది. రథోత్సవం రోజు ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో విశేషంగా భక్తులు పాల్గొని బ్రహ్మరథోత్సవాన్ని కనులారా తిలకించారు. ఆరాధన మహోత్సవాలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ విద్యాసాగర్ పర్యవేక్షణలో బందోబస్తు చేపట్టారు. కాగా భక్తులకు స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు సౌజన్యంతో చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్, రాజంపేట డివిజనల్ మేనేజరు సుశాంత్‌కుమార్ భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు మేనేజరు బాలాదిత్య తెలిపారు.



మాఢవీధుల్లో ఊరేగుతున్న బ్రహ్మరథం

స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



విహారయాత్రలో నాయకులు

- తీర్థయాత్రల్లో కార్యకర్తలు
- ఎన్నికల్లో సంపాదించిన డబ్బుతో జల్సాలు చేస్తున్న వైనం



రైల్వేకోడూరు, మే 18: ఎన్నికల్లో 50 రోజుల పాటు ప్రచారంలో కష్టపడ్డామని, పార్టీ గెలుపు కోసం అలుపెరగకుండా తిరిగామని ఎన్నికలు పూర్తి కాగానే కుటుంబంతో నాయకులు కొందరు విహార యాత్రలు, మరికొందరు తీర్థయాత్రలకు వెళ్లారు. ఎన్నికల్లో సంపాదించిన డబ్బును ఖర్చు పెట్టడానికి విమానాల్లో బుక్ చేసుకుని మరీ వెళ్లారు. ఒకప్పుడు కార్లు, మోటారు సైకిళ్లు లేని నాయకులు ప్రస్తుత ఎన్నికల్లో కార్లు కొన్నారు. పార్టీ గెలుపు కోసం డబ్బులు ఇస్తే దానిని భారీ ఎత్తున మిగిల్చుకుని కుటుంబంతో సహా జల్సాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. విహారయాత్రల్లో స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టడం, ఫారిన్ మందు, ఖరీదైన భోజనాలతో పాటు నాలుగు, ఐదు స్టార్ల కలిగిన రూముల్లో ఎంజాయ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఓటర్లకు పంచమని ఇచ్చిన డబ్బుల్లో కొందరు చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలున్నాయి.

కొందరు నాయకులు ఎన్నికలకు ముందే డబ్బులు చక్కదిద్దుకున్నారు. ఒక్కొక్క నాయకుడు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు తీసుకుని విహార, తీర్థయాత్రలకు వెళ్లి సేదదీరుతున్నారు. వీరు ఏదో సాధించినట్లుగా వ్యవహరించారని, కౌంటింగ్ నాటికి వీరు ఏమి చేయలేదని తేలుతుందని కొందరు నాయకులు, కార్యకర్తలు బహిరంగంగా చెబుతున్నారు. ఓట్లు లేని వారికి డబ్బులు బాగా ఇచ్చారనేది చర్చ సాగుతుంది. జూన్ 4న నాయకుల భవిష్యత్తు బయటపడుతుంది.

తర్వాత ఎవరు ఎంత తిన్నారు, ఎక్కడ తిన్నారు, పార్టీ కోసం ఎంత తిన్నారు అనేది తెలిసిపోతుంది. తినిందంతా కక్కించేందుకు ఒక నాయకుడు సిద్ధంగా ఉన్నాడని రైల్వేకోడూరు పట్టణంలో వివిధ పార్టీల నాయకుల మధ్య చర్చ సాగుతోంది. విహారయాత్రల్లో ఉన్న నాయకులు లాడ్జీల్లోంచి దిగిన సమయం నుంచి మళ్లీ లాడ్జీల్లోకి వచ్చినంత వరకు మొత్తం ఏసీల్లోనే గడుపుతున్నట్లు తెలుస్తోంది. విహార, తీర్థయాత్రలు ముగించుకుని ఈనెలాఖరు నాటికి ఇళ్లకు చేరుకుంటారని సమాచారం.

చదువుల తల్లి ప్రణీత

- తెలంగాణ ఈఏపీసెట్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు



కుమార్తె ప్రణీతకు స్వీట్లు తినిపించి అభినందిస్తున్న తల్లిదండ్రులు శ్రీకర్, కళ్యాణి

మదనపల్లె టౌన్, మే 18: తెలంగాణ విద్యాశాఖ శనివారం విడుదల చేసిన ఈఏపీ సెట్ పరీక్ష ఫలితాల్లో మదనపల్లెకు చెందిన ఎ.ప్రణీత స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో ప్రణీత 146.44492 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. మదనపల్లె పట్టణం టీచర్స్ కాలనీకి చెందిన అలూరి శ్రీకర్ హోమియోపతి వైద్యుడిగా పనిస్తుండగా ఆయన భార్య కళ్యాణి ప్రైవేటు స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరి రెండో కుమార్తె అలూరి ప్రణీత 8వ తరగతి వరకు స్థానిక శ్రీచైతన్య హైస్కూల్లో చదివింది. టెన్త్ నుంచి ఇంటర్ వరకు విజయవాడ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో చదివింది. టెన్త్‌లో 589 మార్కులు సాధించిన ప్రణీత ఇంటర్ బైపీసీలో 982 మార్కులు సాధించింది. ఈ క్రమంలో గత నెల తెలంగాణ విద్యాశాఖ నిర్వహించిన ఈఏపీ సెట్ పరీక్ష రాసిన ప్రణీత స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. మా కళాశాల అధ్యాపకుల సూచనలతో క్రమశిక్షణతో కూడిన చదువుతో తెలంగాణ ఫస్ట్ ర్యాంకు సాధించానని, ఢిల్లీలోని ఎయిమ్స్‌లో కాని జిప్‌మర్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో సీటు సాధించి కార్డియాక్ సర్జన్ చదవాలనుందని ప్రణీత తెలిపింది.

మదనపల్లెకే గర్వకారణం

తెలంగాణ ఈఏపీసెట్‌లో ఫస్ట్ ర్యాంకర్‌గా నిలిచిన ఎ.ప్రణీత మదనపల్లెకే గర్వకారణమని శ్రీచైతన్య హైస్కూల్ రీజనల్ ఇన్‌చార్జి పి.శ్రీధర్ తెలిపారు. శనివారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని శ్రీచైతన్య హైస్కూల్‌కు వచ్చిన ప్రణీత వారి తల్లిదండ్రులకు శ్రీధర్ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. తమ పాఠశాలలో మూడేళ్లు చదివిన పూర్వ విద్యార్థి ప్రణీత తెలంగాణ స్టేట్ ఫస్ట్ ర్యాంకులో నిలబడటం తమకు ఆనందంగా ఉందన్నారు. ప్రణీత పలువురు విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఏజీఎం జి.సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు



- ముస్తాబైన పెంచలకోన
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- వివిధ జిల్లాల నుంచి 120 ప్రత్యేక బస్సులు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు

రాపూరు (డక్కిలి), మే 18: రాపూరు మండలంలోని పెంచలకోనలో ఆదివారం నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు పెంచలకోన ముస్తాబైంది. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉప కమిషనర్ సాగర్‌బాబు, ఆర్డీవో మాలోల తదితరులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గోనుపల్లి నుంచి శోభాయాత్రగా పెంచలకోనకు ఉత్సవమూర్తులు రానున్నారు. అనంతరం అంకురార్పణ, రాత్రి సేనాపతి ఉత్సవం నిర్వహిస్తారు. 20వ తేదీ ఉదయం స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ, ధ్వజారోహణ, రాత్రికి శేషవాహన సేవ, 21న ఉదయం హంస వాహనసేవ, రాత్రికి బంగారు హనుమంత సేవ, 22న ఉదయం సింహవాహన సేవ, రాత్రికి నృసింహ జయంతి సందర్భంగా బంగారు గరుడసేవ నిర్వహిస్తారు. 23న ఉదయం తిరుకల్యాణం, సాయంత్రం రథోత్సవం, రాత్రికి గజవాహనసేవ జరుగుతాయి. 24న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం తెప్పోత్సవం, రాత్రికి ఆశ్వవాహనసేవ, ధ్వజావరోహణం, 25న ఉదయం కోన నుంచి గోనుపల్లికి ఉత్సవమూర్తుల తిరుగు ప్రయాణం, రాత్రికి గ్రామోత్సవం జరుగుతాయి.

కోనలో వసతుల మెరుగు..

కోనలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఉప కమిషనర్ సాగర్ బాబు తెలిపారు. సామాన్య భక్తులు స్వామి వారిని సులభంగా, త్వరితగతిన దర్శించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. ఇందుకోసం ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని, ఎండకు భక్తులు ఇబ్బంది పడకుండా చలవ పందిళ్లు వేశామని ఆయన వివరించారు. భక్తులకు తాగునీటి వసతి కూడా కల్పించామని చెప్పారు.

- ఆలయ ఉపకమిషనర్ సాగర్‌బాబు

పటిష్ట పోలీసు బందోబస్తు

బ్రహ్మోత్సవాలకు లక్షలాదిమంది భక్తులు తరలివస్తారని అంచనా. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి పర్యవేక్షణలో రాపూరు, సంగం, ఆత్మకూరు సీఐలతో పాటు 10మంది ఎస్‌ఐలు, మహిళా పోలీసులు, హోంగార్డులు, ప్రత్యేక పోలీసులు మొత్తం 250మంది వరకు బందోబస్తు నిర్వహిస్తారని రాపూరు ఎస్‌ఐ మాలాద్రి తెలిపారు.

భక్తుల కోసం 120 ఆర్టీసీ బస్సులు

కోన ఉత్సవాలకు నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, కడప, తిరుపతి జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరానున్నారు. దీంతో ఆయా ప్రాంతాల నుంచి సుమారు 120 బస్సులు నడుపుతున్నట్లు రాపూరు ఆర్టీసీ డిపో మేనేజరు అనిల్‌కుమార్ తెలిపారు. అవసరమైతే బస్సుల సంఖ్యను పెంచుతామన్నారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

ఉత్సవాలకు ప్రచారమేది ?

ప్రతి ఏటా కోన బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలు మూలల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. అయితే ఈ ఏడాది అందుకు తగ్గట్టుగా ప్రచారం చేయడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఉత్సవాలకు పదిరోజుల ముందు నుంచే వాల్‌పోస్టర్లను వివిధ డిపోల బస్సులకు అంటిస్తారు. కానీ ఈసారి అలాంటి ఏర్పాట్లు చేయలేదు. ఉత్సవాలకు భారీగా ఆదాయం వస్తున్నా నామమాత్రంగా ప్రచారం కల్పించారనే విమర్శలు ఉన్నాయి.

పట్టువస్త్రాలు ఎవరు సమర్పిస్తారు ?

స్వామివారికి గరుడసేవ రోజున స్థానిక ఎమ్మెల్యే పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. అయితే ఈసారి బ్రహ్మోత్సవాలు జరిగే సమయానికి ఎన్నికల ఫలితాల కోసం నేతలు ఎదురు చూస్తున్నారు. అంతేకాక కోడ్ అమలులో ఉంది. ఈ పరిస్థితుల కారణంగా ఈ ఆనవాయితీ కొనసాగుతుందా.. లేదా? అన్నది అంతుబట్టడం లేదు. ఇక శ్రీవారి కల్యాణం రోజున ముత్యాల తలంబ్రాలను గతంలో ఆలయ చైర్మన్ సమర్పించేవారు. కానీ ఈసారి ఆలయ పాలక మండలి పదవీకాలం పూర్తయింది. కొత్త పాలకమండలి ఏర్పాటు కాలేదు. దీంతో స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు అందచేసే సంప్రదాయం ఉంటుందా... ఉండదా..? అని భక్తులు సందేహిస్తున్నారు.



పెంచలకోనలోని నృసింహుడి ఆలయం

ఇంకా అద్దె భవనాల్లోనే...

- జిల్లాలో సొంత భవనాలు లేని జిల్లా కార్యాలయాలు
- నెలల తరబడి అద్దె బిల్లులు పెండింగ్
- సర్దుకుపోతున్న జిల్లా అధికారులు



రాజంపేట రోడ్డు ఓదివీడు దగ్గర ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు

రాయచోటి(కలెక్టరేట్), మే 18: జిల్లా కేంద్రం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయినా ఇప్పటి వరకు జిల్లా కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సొంత గూటికై పోరాటం, అద్దె కట్టలేక ఆరాటపడుతున్న కార్యాలయాలు జిల్లా కేంద్రంలో చాలా ఉన్నాయి. ఐసీడీఎస్ పీడీ కార్యాలయ, భూగర్భ గనులశాఖ కార్యాలయం, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా దేవదాయశాఖ కార్యాలయం, లేబర్ ఆఫీసు, తూనికలు, కొలతలు ఆఫీస్, జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ కార్యాలయాలకు వేల రూపాయల అద్దె కట్టలేక అధికారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగైదు నెలలకు ఒకసారి ఇంటి బాడుగలు కట్టడానికి తలప్రాణం తోకకు వచ్చినంత పని అవుతోందని అధికారులు చెప్పకనే చెప్పేస్తున్నారు. 1వ తేదీ వచ్చేసరికి ఇంటి ఓనరు బాడుగ అడిగితే బడ్జెట్ వచ్చాక ఇస్తాము అని చెప్పుకుంటూ నెలల తరబడి కాలం నెట్టుకొస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేసింది కానీ కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. ఇలా ఒక్కొక్క కార్యాలయానికి 20 వేల వరకు నెలకు అద్దె ఇస్తున్న ఇరుకైన గదుల్లో సర్దుకుపోతున్నామంటూ సిబ్బంది బహిరంగంగానే చెప్పేస్తున్నారు.

అందుబాటులో లేని ప్రభుత్వ కార్యాలయాలు

జిల్లా కార్యాలయాలు ఏర్పాటు చేసే క్రమంలో కొన్ని కార్యాలయాలు రాజంపేట రోడ్డు ఓదివీడు మైనార్టీ హాస్టల్‌లో ఏర్పాటు చేశారు. ఇక్కడ సోషల్ వెల్ఫేర్ కార్యాలయం, బీసీ వెల్ఫేర్ కార్యాలయం, జిల్లా పంచాయతీ ఆఫీస్, ఏపీఎంఐపీ వారి కార్యాలయం, డ్వామా పీడీ కార్యాలయం, పంచాయతీరాజ్ కార్యాలయం, మత్స్యశాఖ, భూగర్భజల వనరులశాఖ వంటి కార్యాలయాలు అప్పట్లో ఇక్కడ ఏర్పాటు చేశారు. ఇక్కడ దాదాపు 150 మందికిపైగా సిబ్బంది పనిచేస్తున్నారు. వీరందరూ కూడా కడప, తిరుపతి, పీలేరు, మదనపల్లె, రాజంపేట ప్రాంతాల నుంచి ప్రతిరోజూ వచ్చి ఉద్యోగం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇక్కడ దాదాపు 20 మందికి పైగా మహిళలు ఉద్యోగం చేస్తున్నారు. వీరికి తాగడానికి నీళ్లు, మరుగుదొడ్లు కూడా సరిగా లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్టాండు నుంచి దాదాపు నాలుగు కిలోమీటర్లు రావాలంటే కొన్ని సందర్భాల్లో ఎటువంటి రవాణా సౌకర్యాలు లేవని వారు చెబుతున్నారు. కడప నుంచి ఒక బస్సు తీసుకుని అందులో దాదాపు 50 మంది ప్రతిరోజూ ప్రయాణం చేసి ఇంత దూరం వస్తున్నామని చెబుతున్నారు. వేళ కాని వేళలో తాగడానికి నీళ్లు, తినడానికి తిండి కూడా దొరకని ప్రాంతాల్లో మహిళలు అని కూడా చూడకుండా ఉద్యోగాలు వేయడం చాలా దారుణమని కొంతమంది మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు ఒక ప్రత్యేకమైన ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా... వారు అద్దె విషయమై మేము మీకు చెబితే మాకు ఇబ్బంది అవుతుంది. మేమే ఏదో ఒకటి సర్ది చెప్పుకునే ప్రయత్నిస్తున్నాం. వదిలేయండి అని మొహం చాటేస్తున్నారు.



ప్రైవేటు బిల్డింగ్‌లో నడుస్తున్న గనుల శాఖ కార్యాలయం

రేపటి నుంచి నారాపురం వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



నారాపుర వెంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం

జమ్మలమడుగు, మే 18: జమ్మలమడుగు డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ప్రసిద్ధిగాంచిన నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి జరుగనున్నాయి. ఇందుకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు ప్రారంభించారు. ఆలయం లోపలి భాగంలో చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. ఈనెల 20వ తేదీ సోమవారం వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం 6 గంటల నుంచి అంకురార్పణంతో ప్రారంభమవుతాయి. అలాగే అన్నమాచార్య కీర్తనలు, సేనాధిపతి ఉత్సవం, హరికథ జరుగుతాయి. 21న ధ్వజారోహణం, చతుష్టార్చన, ఊంజల్ సేవ, పెద్దశేషవాహనం, కార్యక్రమాలు జరుగుతాయి. 22న చిన్నశేషవాహనం, స్నపన తిరుమంజనం, ఊంజల్‌సేవ, అన్నమాచార్య కీర్తనలు, హంసవాహనం, 23న ముత్యపు పందిరి వాహనం, స్నపన తిరుమంజనం, ఊంజల్‌సేవ, సింహవాహనం, హరికథ కార్యక్రమాలు జరుగుతాయి. 24న కల్పవృక్షవాహనం, హనుమంతవాహనం, 25న మోహిని ఉత్సవం, స్నపన తిరుమంజనం, గరుడవాహనం, 26న సర్వభూపాల వాహనం, స్నపన తిరుమంజనం, కల్యాణోత్సవం, గజవాహనం, 27న సోమవారం రథోత్సవం, ఉదయం 9.30 గంటలకు అనంతరం స్నపన తిరుమంజనం, అశ్వవాహనం జరుగుతాయి. 28న సూర్యప్రభవాహనం, ఊంజల్‌సేవ, చంద్రప్రభ వాహనం, 29న తిరుచ్చి వసంతోత్సవం, చక్రస్నానం, ధ్వజారోహణం జరుగుతాయి. 30న హోమం, సాయంత్రం పుష్పయాగం జరుగుతుంది. భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ అధికారులు కోరారు.

ప్రమాదవశాత్తు ఉపాధి కూలి మృతి



మృతి చెందిన సుబ్బరాయుడు

రాజుపాలెం, మే 18: మండల పరిధిలోని టంగుటూరు గ్రామానికి చెందిన ఉపాధి కూలీ వేంపల్లె చిన్నసుబ్బరాయుడు (65) శనివారం ప్రమాదవశాత్తు ట్రాక్టరుపై నుంచి పడి మృతి చెందాడు. గ్రామ సమీపంలోని అయ్యవారు పల్లెకు వెళ్లే దారిలో చాపాడు పంట కాల్వలో పూడికతీత పనులకు ఉదయం ట్రాక్టరులో బయల్దేరాడు. ట్రాక్టరు డోరుకు ఉన్న కడ్డీ విరగడంతో రోడ్డుపై పడ్డ సుబ్బరాయుడు తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టరులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. మృతునికి భార్య మౌలాలమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ఉపాధి హామీ పథకం జమ్మలమడుగు క్లస్టరు ఏపీడీ గడ్డం ఆనందం, రాజుపాలెం ఏపీవో కె.లక్ష్మీనారాయణ పరామర్శించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చేస్తామని తెలిపారు.

విద్యుత్ కార్యాలయ ఫీల్డ్ అసిస్టెంట్ హఠాన్మరణం



మృతిచెందిన ప్రసాద్

ఎర్రగుంట్ల, మే 18: ఎర్రగుంట్ల నగర పంచాయతీలోని డిస్కం కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రసాద్(53) శనివారం హఠాన్మరణం చెందాడు. మధ్యాహ్నం కార్యాలయ ఆవరణలో ఉన్నఫళంగా కుప్పకూలి పోయాడు. చుట్టూ ఉన్నవారు వెంటనే అతన్ని పలకరించి చూడగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అయితే తెలిసిన వెంటనే సీపీఆర్ చేయడంతో ఒక్కసారి మేల్కొని మళ్లీ కదలకపోవడంతో డాక్టర్ వద్దకు తీసుకెళ్లగా మృతి చెందినట్లు తెలిపారు. ప్రసాద్ మృతి పట్ల అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారన్నారు.

ఎలక్ట్రిక్ షాపుల్లో విజిలెన్స్ దాడులు



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప(క్రైం), మే 18: నగరంలోని ఎలక్ట్రికల్స్ షాపులో శనివారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి షేక్ మాసుం బాషా ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు అధికారులు దాడులు చేశారు. నగరంలోని వీరాస్వామి మండీ వీధిలో రాంసా ఎలక్ట్రికల్‌షాపు, గోడౌన్లలో తనిఖీ నిర్వహించారు. అక్కడి స్టాకు రిజిస్టర్లు, సేల్స్ రిజిస్టరు, పర్చేజ్ రిజిస్టరు తదితర రికార్డులను, గోడౌన్లను తనిఖీ చేశారు. కొన్ని వస్తువులకు ఎమ్మార్పీ లేకుండా తయారీ తేదీ లే కుండా ఉండడంతో కడప లీగల్ మెట్రాలజీ అధికారులు రెండు కేసులు నమోదు చేసి రూ.50 వేలు జరిమానా విధించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఈదురుబాషా, రెడ్డప్ప, బాల గంగాధర్‌రెడ్డి, గీతావాణి, బాబు మోజెస్, ఖాజాహుసేన్, మురళీక్రిష్ణ, అశోక్‌కుమార్, రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

- మామిడి చెట్లు నాటిన వైనం



భూమి కబ్జా చేసి నాటిన మామిడి చెట్లు

సిద్దవటం, మే 18: మండలం టక్కోలి గ్రామ సచివాలయం వెనుక భాగంలో సర్వే నెంబరు 522 టక్కోలి రెవెన్యూ పొలంలో 1.80 సెంట్లు ప్రభుత్వ భూమిని కొంత మంది కబ్జాదారులు దర్జాగా భూమి కబ్జా చేసి ఆ ప్రాంతంలో ఏకంగా మామిడి మొక్కలు నాటివేశారు. గ్రామంలో ఉన్న రెవెన్యూ అధికారి కబ్జాదారులపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో భూ కబ్జాదారులు మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతున్నారని పేదవానికి ఇల్లు కట్టుకోవడానికి 2సెంట్లు స్థలం మంజూరు చేయమని అడిగితే ఏ మాత్రం పట్టించుకోరని పట్టా కోసం కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేయాలని పేర్కొన్నారు. ఏకంగా ప్రభుత్వ భూములను కబ్జా చేస్తుంటే కబ్జాదారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్థానిక వీఆర్వో అండదండలు ఉన్నందునే కబ్జాదారులు పెట్రేగిపోతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయంపై స్థానిక వీఆర్వో చంద్రను వివరణ కోరగా భూకబ్జా జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్నామని అక్కడ సర్వేయర్‌ను పిలిపించి భూమిని సర్వే చేస్తున్నామని పూర్తి నివేదికను మండల తహశీల్దారుకు అందించడం జరుగుతుందని భూమి కబ్జా జరిగి ఉంటే తహశీల్దారు ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

భక్తులతో కిటకిటలాడిన గండి క్షేత్రం





గండి ఆలయం ప్రాంగణంలో భక్తులు, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద టెంకాయలు కొడుతున్న దృశ్యం

చక్రాయపేట, మే 18: గండి వీరాంజనేయస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఆగస్టులో జరిగే శ్రావణ మాసోత్సవాల్లో మొదటివారాన్ని తలపించింది. ఉదయం 10 గంటల నుంచి క్యూలైన్లు కిక్కిరిశాయి. సెలవులు కావడంతో విద్యార్థులు, భక్తులు, మొక్కుబడులు ఉన్నవారు 101 టెంకాయలు కొట్టారు. దీనికి తోడు వేసవి కావడంతో ఎండలు అధికంగా లేకపోవడం, వాతావరణం చల్లబడడంతో భక్తులు గండికి చేరుకున్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు సహాయ కమిషనర్ ముకుందరెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు. ఆకుపూజకు 138, వీఐపీ 200, స్పెషల్ దర్శనం 485, వాహన పూజ 76, లడ్డుప్రసాదాలు 2611 టికెట్లు అమ్ముడైనట్లు తెలిపారు. వీటి ద్వారా రూ.2,89,785 ఆదాయం వచ్చినట్లు ఏసీ ముకుందరెడ్డి తెలిపారు. భక్తులు దాదాపు గంటకు పైగా దర్శనం కోసం వేచి ఉన్నారు. హరికథ కాలక్షేపాన్ని ఏర్పాటు చేశారు. ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్ తీర్థప్రసాదాలు అందించారు. మూల విరాట్‌ను ప్రత్యేక పూలతో అలంకరించారు. అలాగే 1300 మంది దాకా భక్తులు అన్నప్రసాదం తిన్నారు. బాలాలయం అయినప్పటికి భక్తులు పెద్దఎత్తున రావడం విశేషం. ఆలయ నిర్మాణం పూర్తయితే మరింత మంది భక్తులు తండోపతండోలుగా వస్తారని చెబుతున్నారు.


నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం

ప్రసిద్ధ గండి క్షేత్రంలో నిర్వహించే నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం అందించినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, ఛైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో దువ్వూరు మండలం పెద్ద భాకరాపురం వాసి ఉమ్మడి ఆంజనేయులు, ధర్మపత్ని వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. వీరికి ఉప ప్రధాన అర్చ కులు రాజాస్వామి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించినట్లు తెలిపారు.

రేపు ఆర్టీసీ సమస్యలపై డయల్ యువర్ ఆర్ఎం

కడప(మారుతీనగర్), మే 18: ఆర్టీసీ బస్సుల విషయం, సమస్యలపై 20వ తేదీ సోమవారం డయల్ యువర్ ఆర్ఎం నిర్వహించనున్నట్లు ఆర్ఎం గోపాల్‌రెడ్డి తెలిపారు. సమస్యలను నేరుగా ఆర్టీసీ అధికారికి తెలియపరచి నివృత్తి చేసుకునేందుకు వీలుగా 20వ తేది సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం జరగనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలను, సూచనలను, సలహాలను 9959225848 అనే నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ఈ సదవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేడుకగా పెద్దమ్మ తల్లి జాతర





విశేష అలంకరణలో పెద్దమ్మతల్లి, అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చిన మహిళలు


- 80 సంవత్సరాల తర్వాత దేవరకు భారీ స్పందన

ఎర్రగుంట్ల, మే 18: దాదాపు 80 సంవత్సరాల తర్వాత జరుగుతున్న దేవరకు గ్రామస్తులు, భక్తులు పోటెత్తారు. మండలంలోని పోట్లదుర్తిలో పెద్దమ్మ, చిన్నమ్మ దేవర వైభవంగా జరుగుతోంది. శనివారం ఉదయం గ్రామం నాలుగు దిక్కుల్లో మామిడి తోరణాలు కట్టి గ్రామానికి శుభం జరగాలని ప్రార్థించారు. పెద్దమ్మ తల్లికి తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి విశేష అలంకరణ నిర్వహించారు. వేలాదిగా వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయానికి ఎదురుగా అశ్వత్థనారాయణ వృక్షం వద్ద పూజలు నిర్వహించి అమ్మవారి త్రిశూలాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం సుమారు 6 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

చిన్నమ్మ-పెద్దమ్మ ప్రతిమలతో ఊరేగింపు

దేవరలో భాగంగా శనివారం సాయంత్రం కుమ్మరివీధిలో పెద్దమ్మతల్లి-చిన్నమ్మతల్లి ప్రతిమలను చేసి పూజలు చేశారు. అనంతరం ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ సీఎం.రమేశ్, మాజీ సర్పంచ్ సురేశ్‌నాయుడు, ఇతర నాయకులు, పూజలు నిర్వహించారు. కాగా 100 మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు.

భక్తుడిపై దూసుకెళ్లిన కారు- వ్యక్తి మృతి



ప్రమాదవశాత్తు మరణించిన ఇంద్రబాబు

బ్రహ్మంగారిమఠం, మే 18: బ్రహ్మంగారి మఠంలో కారు దూసుకెళ్లడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గుంటూరు పట్టణానికి చెందిన నల్లపాడు గ్రామం నుంచి బ్రహ్మంగారి ఆరాధన గురుపూజా మహోత్సవాలకు పార్లపల్లి ఇంద్రబాబు (56), అతని భార్య జయలక్ష్మి మఠానికి చేరుకున్నారు. శనివారం స్థానిక డిగ్రీకళాశాల ఆవరణలో చెట్టు కింద దంపతులు కూర్చుని ఉండగా ఒక్కసారిగా కారు వారిపైకి దూసుకువచ్చి ఇంద్రబాబుపై వెళ్లడంతో అతనికి తీవ్ర గాయాలై ప్రథమ చికిత్సకు తీసుకెళ తుండగా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అలాగే అతనితో పాటు ఉన్న జయలక్ష్మికి కూడా కాళ్లు వాపులు ఎక్కువగా రావడంతో బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. దూసుకు వచ్చిన కారు హైదరాబాదు బాలానగర్‌కు చెందిన వారిదిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో మృతదేహాన్ని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు బి.మఠం పోలీసులు తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం



మృతిచెందిన ఈశ్వర్ ప్రసాద్

కడప క్రైం, మే 18: కడప నగరం పీఎఫ్ ఆఫీస్ సమీపంలో ఈనెల 17వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో శేషం ఈశ్వర్ ప్రసాద్ (12) దుర్మరణం చెందగా బాలుడి తండ్రికి గాయాలైనట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు ఆర్‌పీఎస్ నగర్ వాసి శేషం వెంకటేశ్వర్లు తన కుమారుడితో కలిసి ఎర్రముక్కపల్లికి ద్విచక్రవాహనంలో వచ్చి తిరిగి వెళ్తుండగా పీఎఫ్ ఆఫీస్ ఎదురుగా వస్తున్న మరో బైకును తప్పించబోయారు. ఈ క్రమంలో వీరి బైకు అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. బాలుడి తలకు బలమైన గాయం తగలడంతో మృతిచెందాడు. గాయపడిన బాలుడి తండ్రిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రక్తదాన శిబిరం

రాజంపేట, మే 18: రాజంపేట వాసవీ రక్తదాన సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వాసవీ కాంప్లెక్స్‌లో రక్షణ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదానం, వాసన్ ఐ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రందే సత్యం, మాజీ అధ్యక్షుడు సత్యనరసింహగుప్త, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవీమాత పుట్టినరోజు సందర్భంగా రాజంపేటలో కంటి పరీక్షలు, రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు.

భద్రావతి సమేత భావనారాయణ రథోత్సవం


పల్లకిపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

సిద్దవటం, మే 18 : సిద్దవటం మండలం మాదవరం- 1 గ్రామ పంచాయతీ పార్వతీపురంలో వెలసిన భద్రావతి సమేత భావనారాయణ స్వామి తిరుణాల మహోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేక అలంకరణతో భాజాభజంత్రీల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఊరేగింపు కార్యక్రమానికి మహిళలు హాజరై దారి పొడవున నీరుపోస్తూ కాయకర్పూరం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

21న నృసింహ జయంత్యుత్సవాలు

రైల్వేకోడూరు, మే 18: ఈ నెల 21న రెడ్డివారిపల్లెలోని లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో 11వ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శనివారం ఆలయ ధర్మకర్త పంద్రా నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 23 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. తోమాల సేవలు, అభిషేకాలు, స్వామి వారి కళ్యాణం, గరుడ సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అందరూ హాజరు కావాలని కోరారు.

21 నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవం

రాజంపేట, మే 18: రాజంపేట మండలం భువనగిరిపల్లె కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 21న మంగళవారం ధ్వజారోహణం, 22న హనుమద్వాహనం ఉంటుందన్నారు. 23న గరుడసేవ జరుగుతుందన్నారు. 24న ఉదయం 9:26 గంటలకు కల్యాణోత్సవం గజ వాహన సేవ ఉంటుందన్నారు. 25న వసంతోత్సవం, ఏకాంత సేవ, ధ్వజావరోహణతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహం వితరణ

రామాపురం, మే18: మండలంలోని నీలకంఠ్రావుపేట గ్రామంలోని ఆలయానికి స్థానిక కంకర మిషన్ యజమాని చంద్రశేఖర్‌రెడ్డి శనివారం వీరాంజనేయ పంచ లోహ ఉత్సవ విగ్రహాలను అందజేశారు. ఆయన సతీమణి లక్ష్మీదేవమ్మ, కుమార్తెలు అనూష, అనిల, కశ్యప్‌రెడ్డి, యోక్షిత్‌రెడ్డి, ఆలయ కార్య నిర్వాహకులు గడికోట మదన్‌మోహన్‌రెడ్డి, బొల్లినేని సుబ్బరాయుడు, కొండయ్య, కాలప్ప, రామసుబ్బారెడ్డి, ఎక్స్ పీఆర్‌వో గడికోట రాముర...

గడికోట రాముర

రెడ్డి, గడికోట సహదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి పూజలు

సుండుపల్లె, మే 18: మండలంలోని ఆరోగ్యపురం ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పూజలు, అభిషేకం నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు అమృనాయక్ తెలిపారు. ఉదయం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు తలనీలాలను సమర్పించారు. చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా వాసవీ జయంతి


రైల్వేకోడూరు పురవీధుల్లో అమ్మవారి కలశాలను శిరసుపై పెట్టుకుని ఊరేగిస్తున్న మహిళలు


కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో వాసవీ జయంతి పూజలు చేస్తున్న మహిళలు

రైల్వేకోడూరు, మే 18: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం వాసవీ జయంతి సందర్భంగా పూజలు, పంచామృతాభిషేకం చేశారు. 108 కలశాలతో ఆర్యవైశ్య మహిళలు జై వాసవాంబ అంటూ పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారి గ్రామోత్సవంతో పాటు మహిళలు దీపాలతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని నీలకంఠ్రావుపేటలో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం ఆలయ సంప్రోక్షణం, మూలవర్లు, ఉత్సవ మూర్తులు, శ్రీచక్రం, స్ఫటిక లింగాలకు రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు, మహాగణపతి పూజ, లలితా సహస్రనామ పారాయణం, నైవేద్యాలు, మహా మంగళహారతి చేశారు. రాత్రికి కుంకుమార్చన, పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సభ్యులు చిన్న రెడ్డెయ్య, సురేంద్ర, వీరయ్య, గణేశ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: మండల కేంద్రంలోని కర్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం వాసవీ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఆలయా న్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం నిర్వహించిన పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్త లకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నందలూరు: నాగిరెడ్డిపల్లెలోని కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకం,ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం వాసవీ కన్యకా పరమేశ్వరిని ము స్తాబు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో కేకు వేలం నిర్వ హించారు. అనంతరం అల్పాహార విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మంలో ఆర్యవైశ్య అధ్యక్షుడు యంబలూరు నరసింహస్వామి, వైస్ ప్రెసిడెంటు మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహశెట్టి, సెక్రటరీ గెలివికుమార్, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు గెలివి మల్లికార్జునశెట్టి, మేడా వెంకటకుమార్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు గెలివి జయలక్ష్మి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు యంబలూరు అనిల్‌కుమార్, గెలివి లోకేష్, వల్లంకొండు చంద్రశేఖర్, వల్లంకొండు శివ, ఎంబలూరు నరసింహప్రసాద్, గోపిశెట్టి రఘు, గెలివి నరేష్,తులసి గిరి, దరిశ హేమంత్, భూపాలం సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ, అన్నదానం చేశారు.

ఒంటిమిట్ట : స్థానిక అమ్మవారిశాలలో ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఆర్యవైశ్యులు సోమిశెట్టి మనోహర్‌బాబు,రెంటాల లోకేష్, తుమ్మలపెంట శ్రీను, కిరణ్, భక్తులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు


మాట్లాడుతున్న పీఎల్ నరసింహులు

రాయచోటిటౌన్, మే18: జిల్లా వ్యాప్తంగా యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను జిల్లా అధికార యంత్రాంగం అరికట్టాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొంతకాలంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరించడం వెనుక ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పేదవాడు ఇల్లు కట్టుకోవడానికి ఇసుక కావాలంటే వేల రూపాయలు ఖర్చు అవుతుండగా, ఇసుక మాఫియా కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నా యన్నారు. సాక్షాత్తూ కోర్టులు జోక్యం చేసుకుంటున్నా, తప్పుడు నివేదికలు తయారు చేసి పంపడం బాధాకరమన్నారు.

ఇప్పటికైనా జిల్లా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్, సీపీఐ సీనియర్ నాయకులు పలమనేరు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలసిన మండిపల్లి, ముక్కా


చంద్రబాబునాయుడును కలసిన రూపానందరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రైల్వేకోడూరు, మే 18: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ను శనివారం హైద్రాబాద్‌లో రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో రైల్వేకోడూరులో అరవ శ్రీధర్ విజయం ఖాయమని చంద్రబాబు కు చెప్పామని తెలిపారు. ఫలితాల విడుదల లోపు చేయవలసిన కార్యక్రమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను చంద్రబాబు తమకు తెలియజేశారన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో దాడులు, ఘర్షణలపై ఆరా తీశారన్నారు.

రాయచోటిటౌన్: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును శనివారం రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కలిశారు. హైదరా బాదులోని చంద్రబాబు నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సార్వత్రిక ఎన్నికల నిర్వహణతో పాటు పలు విషయాలపై చర్చించారు.

చెత్త తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం


చెత్తకుప్పలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు, మే 18: చెత్త తొలగింపులో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి, మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్ తెలిపారు. శనివారం రైల్వేకోడూరు పంచాయతీలోని శ్రీరాంనగర్, ఒంటెలనగర్, ప్రైవేటు కాలేజీల వెనక భాగంలో చెత్తకుప్పలను పరిశీలించారు. చాలా రోజుల నుంచి చెత్త, చెదారాలను తరలించక పోవడంతో దోమలు పెరిగిపోయాయన్నారు. 15 రోజులుగా చెత్త తొలగించకపోవడంతో కుళ్లి దుర్వాసన వెలువడుతోందన్నారు. దీంతో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే చెత్త కుప్పలు ఎత్తకపోతే మాత్రం ప్రజలతో కలసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివయ్య, మహిళా నాయకురాలు పండుగోల రేణుక, పట్టణ ప్రజలు హేమలత, నరసక్క, సుబ్బలక్ష్మీ, రాజారెడ్డి, సురేష్, వెంకటమ్మ, చంద్రశేఖర్, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఈవో తనిఖీ

పుల్లంపేట, మే 18:స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని శనివారం జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.సుధాకర్ రెడ్డి తనిఖీ చేశారు.15 వ ఆర్థిక సంఘ నిధుల మంజూరు, వ్యయం అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ-గ్రామ్ స్వరాజ్ ప్లాన్ ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పనులపై సమీక్ష జరిపారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో హబీబుల్లా ఖాన్, ఈవో ఆర్‌డీ పెంచలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

లచ్చయ్యగారిపల్లెలో మారమ్మ జాతర

రాజంపేట టౌన్, మే18 : మండలంలోని లచ్చయ్యగారిపల్లెలో శనివారం మారమ్మ జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా మారమ్మ, పోతురాజు విగ్రహాలను ఊరేగించారు. అమ్మవారికి వదిలిన దున్నపోతును గ్రామంలో ఊరేగిస్తుండగా మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. మండల ఉపాధ్యక్షుడు ఆకేపాటి రంగారెడ్డి, గోపాల్‌రెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. ఈ ఉత్సవాలు రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి.

వర్షంతో ఉపశమనం


రాజంపేటలో జలమయమైన రోడ్లు

రాజంపేట, మే18 : రాజంపేట చుట్టుపక్కల గ్రామాల్లో శని వారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వీధులు జలమయమయ్యాయి. రాజంపేటతో పాటు ఊటుకూరు, భువనగిరిపల్లె, ఆకేపాడు, తాళ్లపాక చుట్టుపక్కల గ్రామాల్లో వర్షం కురిసింది. ఈ వర్షంతో ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. చిన్నపాటి వర్షానికే రాజంపేట పట్టణ ప్రధాన రోడ్లు జలమయమై, దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

రాయచోటిటౌన్: పట్టణంతో పాటు మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజులుగా అత్యంత వేడితో పాటు ఎండలతో అల్లాడిన ప్రజానీకానికి ఈ వర్షం ఉపశమనాన్నిస్తోంది. సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉండడంతో పట్టణ ప్రజలతో పాటు మండలంలోని రైతులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంతో టమోటా, వంగ, కూరగాయల పంటలతో పాటు మామిడి పంటకు మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు.

రైల్వేకోడూరు: మండలంలో శనివారం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. పిడుగులు పడినట్లుగా పెద్ద శబ్దం వచ్చింది. తర్వాత పెనుగాలులు వీచాయి. మండలంలో అక్కడక్కడ అరటి, మామిడి, బొప్పాయి చెట్లు నేల కూలినట్లు రైతులు తెలిపారు. వాతావరణం చల్లగా మారింది. దీంతో కొంత మేరకు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

వందశాతం టీకాల లక్ష్యాన్ని చేరుకోవాలి

●జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ రియాజ్‌బేగ్


టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

రాయచోటిటౌన్, మే 18: టీకాల లక్ష్యాన్ని వంద శాతం చేరుకోవాలని జాతీయ ఆరోగ్య మిషన్ అన్నమయ్య జిల్లా పర్యవేక్షణ అధికారి (డీపీయంవో) డాక్టర్ రియాజ్ బేగ్ అన్నారు. వ్యాధి నిరోధక టీకాల తనిఖీలో భాగంగా శనివారం ఆయన రాయచోటి పట్టణంలోని కొత్తపల్లె అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో రెడ్డీస్ కాలనీ సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్య క్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్దిదారుల జాబితా ప్రకారం ముందస్తు సమాచారం ఇచ్చి టీకాలు వెనుకునే విధంగా ప్రోత్సహించి లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేయా లన్నారు. టీకాలు వేసిన తర్వాత లబ్ధిదారులకు 8 సూచనలివ్వాలన్నారు. శిశువుల్లో పుట్టుకతో ఉన్న లోపాలు ఏవైనా ఉన్నాయేమో అని తల్లిని అడిగి తెలుసుకోవడంతో పాటు పరీక్షలు నిర్వహించాలని, ఒకవేళ అనుమానం ఉంటే ఏరియా ఆసుపత్రిలో ఉన్న చిన్నపిల్లల నిపుణుల దగ్గరకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఏఎన్‌ఎంతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

23న రాయచోటి మండల సర్వసభ్య సమావేశం

రాయచోటిటౌన్, మే18: ఈ నెల 23న గురువారం ఉదయం 10 గంటలకు రాయచోటి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పల్లపు రాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి సురేంద్రనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సాధారణ సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి తీర్మానాలను ఆమోదం తెలిపేందుకు అవకాశం ఉండదని తెలిపారు. మండల పరిధిలోని ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పంచాయతీ సర్పంచులు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

నామమాత్రంగా మండల సమావేశం


ఎంపీడీఓతో మాట్లాడుతున్న ఒంటిమిట్ట సీఐ, సిద్దవటం ఎస్‌ఐలు

సిద్దవటం, మే 18: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా జరిగింది. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం జరిగిన అల్లర్ల నేపథ్యంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, సిద్దవటం ఎస్‌ఐ ఓబన్న ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావుతో మాట్లాడారు. ఎన్నికల అనంతరం గొడవలు జరగకుండా తాత్కాలిక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమా వేశానికి వచ్చిన సభ్యులు, అధికారులు సంతకాలు చేశారు. సమ స్యలపై సభ్యులు ఎలాంటి చర్చ జరగకుండానే సభ్యులు వెళ్ళిపోయారు .

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఉద్యమం

రాయచోటిటౌన్, మే 18: ఏపీ రెగ్యులరైజేషన్ ఆఫ్ సర్వీసెస్ ఆఫ్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యాక్ట్ 2023 ప్రకారం 10,117 కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం కొత్త ప్రభుత్వం రాగానే ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఉద్యోగ నియామక విధానాన్ని రద్దు చేయాలని, రెగ్యులర్ విధానంలోనే నియామకాలన్నీ చేపట్టాలని, అన్ని విధాలా అర్హులైన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్‌లు అందరినీ రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో అవిశ్రాంత పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన తెలిపారు. దశాబ్దాలుగా ప్రభుత్వాల వివక్షకు గురవుతూ సమాన పనికి సమాన వేతనం అందక అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ముగిసిన వీరబ్రహ్మంగారి ఆరాధన ఉత్సవం


వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

సుండుపల్లె, మే 18: మండల కేంద్రానికి సమీపంలోని సాతు పల్లె, ఈడిగపల్లె సమీపంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు శనివారం ఉదయం ముగిశాయి. ఈ సందర్భంగానామ సంకీర్తన, అభిషేకాలు, సహస్రనామార్చన నిర్వహించారు. బద్వేలు కళాబృందం ఆధ్వర్యంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకం ప్రదర్శించారు. బ్రహ్మంగారి నాటకం తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శనివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ధర్మకర్త గడికోట ఆంజనేయులుఆచారి పర్యవేక్షించారు.

సంబేపల్లె: మండలంలోని దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లిలో శనివారం వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం సందర్భంగా స్వామివారిని పల్లకిపై ఊరేగించారు. భక్తులు టెంకాయ, కర్పూరం సమర్పించారు. అనంతరం ఆదివారం ఉదయం పోలేరమ్మకు బోనాలను సమర్పించనున్నట్లు తెలియజేశారు.

టీడీపీ సీనియర్ కార్యకర్త చిన్నప్పకు పరామర్శ


కదిరి చిన్నప్పను పరామర్శిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు

చిన్నమండెం, మే 18: వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన రాయచోటి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్లూరు టీడీపీ సీనియర్ కార్యకర్త కదిరి చిన్నప్పను రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు శనివారం పరామర్శించి, దాడికి కారణాలపై ఆరా తీశారు. టీడీపీ కార్యకర్తలు ఎవ్వరూ అధైర్యపడవద్దని, రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా పాగేటి గంగమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో పాగేటిగంగమ్మ

సంబేపల్లె, మే18: మండలంలోని శెట్టిపల్లె గ్రామం గాండ్లపల్లి వద్ద శనివారం పాగేటి గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. విద్యుత్ దీపాలంకరణతో అలంకరించిన చాందినీ బండ్లు ఊరేగిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ అమ్మవారి జాతరలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అలరించిన పాండవ జననం హరికథ


హరికథ ఆలపిస్తున్న హైమావతి

లక్కిరెడ్డిపల్లె, మే18: కోనంపేటలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పంచమ వేద మహాభారత యజ్ఞంలో భాగంగా శనివారం భాగవతారిణి హైమావతి పాండవ జననం హరికథా కాలక్షేపం నిర్వహించారు. మహా భారతంలోని ఘట్టాలను ప్రతిరోజు హరికథ రూపంలో ఆలపిస్తారని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహాభారత యజ్ఞ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

నేడు గంగమ్మకు పొంగుబాళ్లు

చిట్వేలి,మే18 : మండల కేంద్రంలో ఆదివారం గంగమ్మకు పొంగుబాళ్ళ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు శనివారం చాటింపు వేశారు. జాతర నిర్వహించడానికి సౌకర్యం లేకపోవడంతో ముద్దలు పెట్టుకునే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారికి పొంగుబాళ్ళు నిర్వహించాలని నిర్వాహకులు నిర్వహించారు.

నేడు ఎస్పీ బాధ్యతల స్వీకరణ


హర్షవర్ధనరాజు

తిరుపతి (నేరవిభాగం), మే 18 : తిరుపతి జిల్లా ఎస్పీగా హర్షవర్ధనరాజు నియమితులయ్యారు. ఆదివారం ఆయన తిరుపతికి చేరుకుని బాధ్యతలు చేపట్టనున్నారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన హర్షవర్ధన రాజు గ్రూప్-1 పరీక్షలు రాసి డీఎస్పీగా ఎంపికయ్యారు. అనంతరం నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి పొందారు.విజయవాడ డీసీపీగా,అన్నమయ్య జిల్లా ఎస్పీగా పని చేశారు.ప్రతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి ప్రాధాన్యత ఇచ్చేవారని సమాచారం. ముక్కుసూటిగా పనిచేస్తారనే పేరుపడ్డ ఈయన్ను కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల బీహార్ ఎన్నికల అబ్జర్వర్‌గా నియమించింది.ప్రస్తుతం సీఐడీ విభాగం నుంచి తిరుపతి కి ఎస్పీగా రానున్నారు.

తిరుపతికి చేరిన సిట్ బృందం

ఎన్నికల కేసులపై నేడు విచారణ, పునఃసమీక్ష

తిరుపతి(నేరవిభాగం), మే 18 : ఎన్నికల పోలింగ్ రోజు, తర్వాత సంభవించిన హింసాత్మక ఘటనలపై విచారణ నిమిత్తం ఎన్నికల కమిషన్ నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) నేడు తిరుపతిలో విచారణ చేపట్టనుంది.తిరుపతి జిల్లాలో జరిగిన పలు హింసాత్మక ఘటనలపై లోతుగా విచారణ జరిపి, స్థానిక పోలీసు అధికారుల వైఫల్యాన్ని గుర్తించడంతో పాటు కేసుల నమోదులో అవసరమైన మార్పు చేర్పులు, సెక్షన్ల మార్పు చేర్పులను సూచించడం, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సిఫారసులు చేయనుంది.సిట్ బృందంలోని ఏసీబీ డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ ప్రభాకర్ శనివారం రాత్రి 12గంటలకు తిరుపతికి చేరుకున్నారు.ఆదివారం ఉదయం నుంచే వీరు దర్యాప్తు ప్రారంభిస్తారు.రామచంద్రాపురం మండలం బ్రాహ్మణకాలువ, పాకాల మండలం పులివర్తివారి పల్లి, చంద్రగిరి మండలం కూచువారిపల్లి, తిరుపతిలోని మహిళా వర్శిటీ వద్ద జరిగిన హింసాత్మక ఘటనలపై లోతుగా విచారించనున్నారు. వీటితో పాటు గూడూరు, వెంకటగిరి, చిల్లకూరు ప్రాంతాల్లో జరిగిన ఘర్షణలపైనా విచారణ చేపడతారు.వీటికి సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లను పునః సమీక్షించనున్నారు.

టిప్పర్ బోల్తా : డ్రైవర్ మృతి


బోల్తాపడిన టిప్పర్ - కేబిన్‌లో ఇరుక్కుపోయిన రాజేష్ మృతదేహం

బంగారుపాళ్యం, మే 18: టిప్పర్ బోల్తాపడడంతో డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని ఎగువ బందార్లపల్లె వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. చెన్నై - బెంగళూరు హైవే పనుల్లో భాగంగా టిప్పర్‌లో తెచ్చిన మట్టిని ట్రిప్పింగ్ చేస్తుండగా అదుపు తప్పి బోల్తాపడింది. ఈ క్రమంలో హైడ్రాలిక్ విరిగిపోయి కేబిన్‌లో ఉన్న డ్రైవర్ రాజేష్ (35) కడుపులో గుచ్చుకుపోయింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి

సోమల, మే 18: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి బాలుడు మృతి చెందాడు. సోమల మండలం పేటూరు పంచాయతీ పొలికిమాకుల పల్లెకు చెందిన జయరాంరెడ్డి, మమత దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో చిన్నకుమారుడు చేతన్ కుమార్‌రెడ్డి (7) శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపంలోని నీటి కుంట వద్దకు బహిర్భూమికని ఒంటరిగా వెళ్లాడు. ప్రమాదవశాత్తు కుంటలో పడి మునిగి పోయాడు. గ్రామస్తులు గుర్తించి చేతన్ కుమార్ మృత దేహాన్ని వెలితీశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం .. ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితులతో పోలీసులు

రామకుప్పం, మే 18: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ శివకుమార్ కథనం మేరకు.. రామకుప్పం మండలం పచ్చారుమాకులపల్లెకు చెందిన అంజిరాజు, ప్రభు కర్ణాటక నుంచి ద్విచక్రవాహనంలో మద్యం రవాణా చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ శివకుమార్ నేతృత్వంలో పోలీసుల గ్రామ పొలిమేర్లలో కాపుగాసి ద్విచక్రవాహనంలో వస్తున్న నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 192 కర్ణాటక మద్యం ప్యాకెట్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండుకు తరలించారు. మద్యం విలువ సుమారు రూ.12,000 ఉంటుంది.

23 నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చిత్తూరు (సెంట్రల్), మే 18: ఖరీఫ్ సీజన్‌కుగాను జిల్లాలో ఈనెల 23 నుంచి సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ తెలిపారు. 'ఖరీఫ్ సాగుకు ప్రణాళికేది?' అంటూ శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఖరీఫ్ సీజన్‌కు గాను 38,655 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు ఆర్బీకేల ద్వారా 40 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వేరుశనగ కే6 రకం బస్తా (30 కిలోలు) పూర్తి ధర రూ.1710 కాగా, రాయితీ రూ.684 పోను రైతు వాటా కింద రూ.1026 చెల్లించాలన్నారు. నారాయణి రకం బస్తా (30 కిలోల) పూర్తి ధర రూ.1746 కాగా, రాయితీ రూ.698 పోను రైతు వాటా కింద రూ.1048 చెల్లించాలని తెలిపారు. సబ్సిడీ విత్తనాల పంపిణీలో కౌలు, సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. సబ్సిడీ విత్తనాల కోసం రైతులు ఆర్బీకే కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

భక్తజనసంద్రంగా ముక్కంటి ఆలయం


స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లో నిరీక్షిస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, మే 18: శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తజనసంద్రంగా మారింది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,987మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 2,680మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రాహు కేతు పూజలు రూ.500 టిక్కెట్ల ద్వారా 2,846మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,049, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 248మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 264మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 79మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. మొత్తంగా 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే 21,055 ప్రసాదాలు అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శాస్త్రోక్తంగా చిన్నకొట్టాయి ఉత్సవం


స్వామి అమ్మవార్లకు అభిషేకం

శ్రీకాళహస్తి, మే 18: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్న కొట్టాయిఉత్సవం శనివారం శాస్త్రోక్తంగా జరిగింది. మొదట స్వామి అమ్మవార్లకు పగడ చెట్టు వద్ద విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి అమ్మవార్లను ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

జోగివారిపల్లెలో గజ బీభత్సం


ఏనుగులు కూల్చివేసిన కంచె - విరిచేసిన మామిడి చెట్ల కొమ్మలు


తొక్కేసిన టమోటా పంట

సదుం, మే 18: మండలంలోని జోగివారిపల్లె అటవీ శివారు ప్రాంతాల్లోని పంట పొలాల్లో తరచూ ఏనుగుల సంచారం, వాటి వల్ల వాటిల్లుతున్న పంట పొలాల నష్టం ప్రాంత వాసుల్లో వణకు పుట్టిస్తోంది. రెండు రోజుల క్రితం బత్తలారిపల్లెలో విద్యుత్ స్తంభాలు, డ్రిప్ పరికరాలు నష్టపరచిన ఏనుగులు తాజాగా శుక్రవారం రాత్రి అదే బత్తలవారిపల్లె, జోగివారిపల్లె అటవీ శివారు ప్రాంతంలోని మామిడి, వరి, టమోటా, పశుగ్రాస పంటలు, నీటిని సరఫరా చేసే పీవీసీ పైపులు, తోటలకు ఏర్పాటు చేసిన ఇనుప తీగల కంచెలను నష్టపరిచి, తరచూ గ్రామ సమీపాల్లో ఏనుగుల సంచార నియంత్రణకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు నరసింహారెడ్డి, రెడ్డప్ప రెడ్డి, జ్యోతి, సురేశ్ రెడ్డి, రఘు, స్థానికులు కోరుతున్నారు.

అంకాళపరమేశ్వరిగుడి పాత పూజారి కిడ్నాప్

ఆలస్యంగా వెలుగు చూసిన వైనం ● మీడియాకు వివరించిన బాధితుడు


అగరమంగళం గ్రామానికి సమీపంలో గల అంకాళపరమేశ్వరి ఆలయం - పూజారి రామచంద్రన్

గంగాధరనెల్లూరు, మే 18: గంగాధరనెల్లూరు మండలం అగరమంగళం సమీపంలోని అంకాళపరమేశ్వరి గుడి పాత పూజారిని కొందరు కిడ్నాప్ చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై బాధితుడు, అగరమంగళం దళితవాడకు చెందిన రామచంద్రన్ శనివారం మీడియాతో మాట్లాడారు. 'చాలా ఏళ్ల కిందట దళితవాడకు సమీపంలోని సొంత భూమిలో షెడ్డు నిర్మించుకుని అంకాళపరమేశ్వరి గుడికి పూజారిగా ఉంటూ పూజలు చేసుకుంటున్నా. ఆ గుడికి కొన్నేళ్ళ క్రితం బెంగళూరుకు చెందిన దీపక్‌కుమార్ తాళ్ల వచ్చి అమ్మవారిని దర్శించుకుని వెళ్లారు. తమ దీర్ఘకాల సమస్య పరిష్కారమైందంటూ ఆయన మళ్లీ గుడికి వచ్చారు. పాత గుడి స్థానంలో కొత్తది నిర్మిస్తానని చెప్పారు. పాత గుడిస్థలంతో పాటు మరికొంతభూమిని స్థానికులవద్ద సేకరించి.. పెద్దఎత్తున గుడి నిర్మించారు. పూజలు కొనసాగిస్తూ వస్తూ కొత్త గుడికి చైర్మన్‌గా దీపక్‌కుమార్ తాళ్ళ వ్యవహరిస్తున్నారు. శ్రీరంగరాజపురం మండలం కొటార్లపల్లె వద్ద స్మార్ట్ డీవీ సాఫ్ట్‌వేర్ కంపెనీకి కూడీ ఈయనే చైర్మన్. కొత్తగుడి చైర్మన్ దీపక్‌కుమార్ గుడిపేరుతో కొత్త ట్రస్ట్ ఏర్పాటు చేసి ఆ ట్రస్ట్‌లో నాకు అవకాశం లేకుండా చేశారు. గుడి పరిసరాలకు రానీయడంలేదు' అని రామచంద్రన్ వివరించారు. కొంతకాలంగా కొత్తగుడి పరంగా వారితో తనకు వివాదం కొనసాగుతోందన్నారు.తమ కుటుంబసభ్యులకు సంబంధించి భూమిని దీపక్‌కుమార్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాలని ఒత్తిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై పలుసార్లు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేసుకుని కోర్టులను సైతం ఆశ్రయించినట్లు వివరించారు. సుమారు 20 రోజుల క్రితం పొలాల్లో మేకలు మేపుకుంటున్న తనను తమిళనాడు పోలీసుల డ్రస్‌లతో కొంతమంది వచ్చి కాట్పాడి పోలీస్టేషన్‌కు విచారణకు రావాలని బలవంతంగా వాహనంలో తీసుకెళ్లారన్నారు.కొటార్లపల్లె వద్ద గల స్మార్ట్ డీవీ సాఫ్ట్‌వేర్ కంపెనీ వద్దకు.. అక్కడ్నుంచి పళ్ళిపట్టు మీదుగా వివిధ ప్రాంతాల్లో తిప్పిస్తూ 10రోజులుగా తనను ఇబ్బంది పెట్టారన్నారు. ప్రాణాలు తీసేందుకు ఇంజక్షన్ వేశారన్నారు. తాను కొద్దిరోజులుగా కనపడటం లేదని తమ కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. అంతలోగానే తాను కిడ్నాపర్లనుంచి తప్పించుకుని పోలీసులను ఆశ్రయించానని ఆయన చెప్పారు. కాగా, దీనికి సంబంధించి దీపక్‌కుమార్ తాళ్ళతో పాటు 11మందిపై కిడ్నాప్ కేసు నమోదైనట్లు తెలిసింది. వారిలో నలుగురిని అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం. కిడ్నాప్‌కేసులో మరికొంతమంది పరారీలో ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటన విషయమై గంగాధరనెల్లూరు సీఐ శంకర్‌ను వివరణ కోరగా.. ఈ కేసు సుమారు నెల రోజుల కిందటిదని చెప్పారు. డీఎస్పీ స్థాయిలో కేసు కొనసాగుతోందన్నారు.


తిరుపతి కలెక్టర్‌కు రికార్డులు అప్పగించండి

ఎపిక్ కార్డుల కేసు విషయమై చిత్తూరు కలెక్టర్‌కు ప్రభుత్వ ఆదేశం

తిరుపతి, మే 18 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల క్రితం జరిగిన తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న ఎపిక్ కార్డుల అక్రమ డౌన్‌లోడ్ కేసులో రికార్డులను తిరుపతి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు స్వాధీనం చేయాలని చిత్తూరు కలెక్టర్‌ను శనివారం సాధారణ పరిపాలనాశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఆదేశించారు.తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు 36 వేల ఓటరు కార్డులను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచీ ఎలాంటి క్లైమ్‌లూ లేకుండా డౌన్‌లోడ్ చేసిన ఈ కేసులో బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన విచారణకు ఆదేశించిన నేపథ్యంలో తిరుపతి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రెజెంటింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికలు తిరుపతిలో జరిగినప్పటికీ చిత్తూరు కలెక్టర్ ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారి హోదాలో పర్యవేక్షణ బాధ్యత వహించారు. చిత్తూరు కలెక్టరేట్‌లో ఉన్న సంబంధిత రికార్డులను తిరుపతి కలెక్టర్‌కు అప్పగించాలని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సింహ, ముత్యపు పందిరి వాహనాలపై

గోవిందుడి చిద్విలాసం


సింహ వాహనం - ముత్యపు పందిరి వాహనం

తిరుపతి(కల్చరల్), మే 18: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ఏడు గంటలకు సింహవాహనంపై స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించారు. 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తులకు ఆలయంలో వైభవంగా స్నపన తిరుమంజనం జరిగింది. రాత్రి ఏడు గంటలకు ముత్యపు పందిరి వాహనసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు మాడవీధుల్లో స్వామి వారికి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టారు. వాహన సేవ ముందు వివిధ కళారూపాల ప్రదర్శనలు అలరించాయి. ప్రధానంగా కోలాటం, వీరనృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వాహన సేవ ముందు వేదపండితులు, జీయరు స్వాములు స్వామివారిని కీర్తిస్తూ కదిలారు. ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజి, సీఈ నాగేశ్వరరావు, ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ధనంజయ, భక్తులు పాల్గొన్నారు.

నేటి వాహనసేవలు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం కల్పవృక్ష, రాత్రి సర్వభూపాల వాహన సేవలు జరుగుతాయి.



వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో శ్రీనివాసుడు

వడమాలపేట, మే 18: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవింద నామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని మేళతాలలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళహారుతలిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు

తిరుమల, మే 18 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 71,510 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 43,199 మంది తలనీలాలు సమర్పించారు.

పరిశోధనల్లో మెలకువలకు అవకాశం


ఎస్వీయూ ప్రతినిధులతో ఎస్వీ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్

తిరుపతి (వైద్యం), మే 18: ఎస్వీయూతో తమకు పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరితే మెడికల్, నాన్ మెడికల్ విద్యార్థులకు, అధ్యాపకులకు పరిశోధనల్లో మెలకువలను నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ తెలిపారు. ఎస్వీ వైద్య కళాశాల, ఎస్వీయూ మధ్య ఎంఓయూపై చర్చించడానికి శనివారం తొలి సమావేశం ఎస్వీయూలో నిర్వహించారు. ఈ ఒప్పందం కుదిరితే సోషల్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీనిపై పలు విభాగాలతో చర్చించాక వచ్చే సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.ఎస్వీయూ రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, ఎస్వీఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్లు, సునీత పాల్గొన్నారు.

14 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 18: జిల్లాలో శుక్రవారం ఉదయం 8నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు 14 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షాలు కురిశాయి. గంగవరంలో 70.4మి.మీ, పలమనేరు 53.0, వెదురుకుప్పం 46.2, వి.కోట 44.2, బైరెడ్డిపల్లి 29.2, చౌడేపల్లి 16.2, పెద్దపంజాణి 9.2, రామకుప్పం 4.8, శ్రీరంగరాజపురం 3.6, గుడుపల్లి 3.4, నగరి 3.2, పుంగనూరు 3.2, శాంతిపురం 2.0, పాలసముద్రం 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మే నెల సగటు వర్షపాతం 67.2 మి.మీ నమోదు కావాల్సివుండగా, శనివారం వరకు 63.9 మి.మీ నమోదైంది.

నాలుగు కేంద్రాల్లో

రీ పోలింగ్ జరిపించండి

ఎమ్మెల్యే చెవిరెడ్డి అభ్యర్థన - ఈసీకి నివేదిస్తామన్న కలెక్టర్

తిరుపతి, మే 18 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలోని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో రీ పోలింగ్ జరపాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి కోరినట్టు సమాచారం. శనివారం కలెక్టరేట్‌కు వెళ్లి జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్‌ను కలసిన చెవిరెడ్డి పాకాల మండలం నేలదానిపల్లికి చెందిన 64వ నంబరు పోలింగ్ కేంద్రం,రామచంద్రాపురం మండలం చిన్నరామాపురానికి చెందిన 110వ నంబరు పోలింగ్ కేంద్రం, చంద్రగిరి మండలం ఎగువ కాశిపెంట్లకు చెందిన 156వ నంబరు పోలింగ్ కేంద్రం,కల్‌రోడ్డుపల్లికి చెందిన 157వ నంబరు పోలింగ్ కేంద్రంలో రీ పోలింగ్ నిర్వహించాలని లిఖితపూర్వకంగా అభ్యర్థించినట్టు తెలిసింది.అయితే పోలింగ్ సిబ్బంది నుంచీ గానీ, ఇరు పార్టీలకు చెందిన ఏజంట్ల నుంచీ గానీ, పరిశీలకుల నుంచీ గానీ ఎలాంటి ఫిర్యాదులు లేనందున రీ పోలింగ్ విషయంలో తానేమీ చేయలేనని, విషయాన్ని ఈసీ దృష్టికి తీసుకెళతానని కలెక్టర్ స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈసీ స్పందించని పక్షంలో హైకోర్టును ఆశ్రయించాలని చెవిరెడ్డి భావిస్తున్నట్టు సమాచారం. కలెక్టర్‌ను కలసిన చెవిరెడ్డి వెంట ఆయన చిన్న కుమారుడు హర్షిత్‌రెడ్డి, న్యాయవాది వున్నట్టు తెలిసింది. గత ఎన్నికల్లోనూ ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన ఫిర్యాదుతో ఆరు కేంద్రాల్లో రీ పోలింగ్‌కు ఈసీ ఆదేశించిన సంగతి తెలిసిందే. అప్పట్లో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ ఫిర్యాదుతో ఒక కేంద్రంలో రీ పోలింగ్ నిర్వహించారు.

సమయపాలన ఏదీ..?

● గ్రామ సచివాలయ ఉద్యోగులు ఎప్పుడొస్తారో..? ● ఉదయం 11.30 గంటలకు సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



చౌడసముద్రం సచివాలయంలో ఉదయం 10.30 గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



కాలువపల్లె సచివాలయంలో ఉదయం 11.30 గంటలకు సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

ములకలచెరువు, మే 18: గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదని ప్రజలు వాపోతున్నారు. శనివారం పనిదినమైనా మూడు చోట్ల సచివాలయాల్లో ఉద్యోగులు ఉదయం 11 గంటలైన విధుల్లో కన్పించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సార్వత్రిక ఎన్నికలు ముగిసి ఐదు రోజులైన గ్రామ సచివాలయాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. మారుమూల ప్రాంతాలైన ములకలచెరువు మండలంలోని చౌడసముద్రం, కాలువపల్లె, గూడుపల్లె, పాత ములకలచెరువు సచివాలయాల్లో శనివారం ఉదయం 'ఆంధ్రజ్యోతి విజిట్ నిర్వహించింది. ఈ సందర్భంగా తొలుత మారుమూల ప్రాంతమైన, బస్సు సౌకర్యం సరిగా లేని చౌడసముద్రం సచివాలయాన్ని 10.15 గంటలకు పరిశీలించగా అక్కడ డిజిటల్ అసిస్టెంట్ గణేష్ మాత్రమే విధులు నిర్వర్తించడం కన్పించింది. మిగిలిన వారు ఎక్కడని ప్రశ్నించగా మొత్తం తొమ్మిది మంది గ్రామ సచివాలయంలో పనిచేస్తుండగా ముగ్గురు సెలవు పెట్టారని సమాధానం చెప్పారు. మిగిలిన ఐదు మంది ఉద్యోగులు 10.30 గంటలైనా విధులకు హాజరుకాలేదు. అనంతరం 11.38 గంటలకు కాలువపల్లె గ్రామ సచివాలయాన్ని పరిశీలించగా ముగ్గురు ఉద్యోగులు ఉన్నారు. మొత్తం తొమ్మిది మందికి గానూ ఒకరు సెలవు పెట్టారని, జేఎల్ఎం అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి ఫీల్డ్‌కు వెళ్ళారని విధుల్లో ఉన్న ఉద్యోగులు సమాధానం చెప్పారు. మిగిలిన నలుగురు 11.38 గంటలకు గానూ విధులకు హాజరుకాలేదు. తరువాత 12.04 గంటలకు గూడుపల్లె గ్రామ సచివాలయాన్ని పరిశీలించగా 10 మందికి గానూ ముగ్గురు విధుల్లో కన్పించారు. మిగిలిన వారి గురించి ఆరా తీయగా ఇద్దరు సెలవు పెట్టారని చెప్పారు. మిగిలిన ఐదు మంది 12.04 గంటలైనా గ్రామ సచివాలయంలో కన్పించలేదు. ఎక్కడికి వెళ్లారని అడగ్గా ఫీల్డ్‌కు వెళ్లారని సమాధానం చెప్పారు. అలాగే పాత ములకలచెరువు గ్రామ సచివాలయంలో ఎనిమిది మందికి గానూ ఎనిమిది మంది విధుల్లో ఉన్నట్టు అటెండెన్స్ రిజిస్టర్ సంతకాలు చేశారు. సచివాలయంలో మాత్రం ముగ్గురు విధుల్లో ఉన్నారు. మిగిలిన వారి ఎక్కడిని అడిగితే ఫీల్డ్‌కు వెళ్లారని చెప్పారు.

ఫీల్డ్ పేరుతో విధులకు డుమ్మా..?

ములకలచెరువు మండలంలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఉద్యోగులు ఫీల్డ్ విజిట్ పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ సచివాలయాల ఉద్యోగుల విధులను పర్యవేక్షించాల్సిన అధికారులు సార్వత్రిక ఎన్నికల విధుల్లో మునిగిపోయారు. దీంతో గ్రామ సచివాలయాలపై పర్యవేక్షణ, నిఘా కొరవడింది. సార్వత్రిక ఎన్నికలు ముగిసి ఐదు రోజులైనా గ్రామ సచివాలయాలపై మండల స్థాయి అధికారులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణలేదు. సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటికైనా గ్రామ సచివాలయాపై పర్యవేక్షణ సాగించి ఉద్యోగులు సమయపాలన పాటించడంతో పాటు పూర్తి స్థాయిలో విధులకు హాజరై గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలందించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు

గ్రామ సచివాలయ సిబ్బంది సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటాం. చౌడసముద్రం, కాలువపల్లె, గూడుపల్లె సచివాలయాల్లో సిబ్బంది హాజరుపై సమాచారం తీసుకుంటాం. ఎవరైనా విధులకు గైర్హాజరై ఉంటే చర్యలు తీసుకుని వారి జీతాలు నిలిపివేస్తాం.సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలి.

-పోలప్ప, ఎంపీడీవో, ములకలచెరువు

సర్పంచ్ ప్రతాప్‌కుమార్‌రెడ్డికి కన్నీటి వీడ్కోలు



భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న కిశోర్‌కుమార్ రెడ్డి, తనూజా రెడ్డి

కలికిరి, మే 17: టీడీపీ నాయకుడు, కలికిరి పంచాయతీ సర్పంచు రెడ్డి వారి ప్రతాప్‌కుమార్ రెడ్డికి ఆప్తులు, స్నేహితులు, బంధువుల కన్నీటి వీడ్కోలు నడుమ శనివారం అంత్యక్రియలు జరిగాయి. ఆయన ఆకస్మిక మరణం మండల ప్రజలను కన్నీటి పర్యంతం చేసింది. అంత్యక్రియలకు ముందు ఆయన భౌతిక కాయాన్ని ప్రజల సందర్శన కోసం ఉంచారు. పలువురు ప్రముఖులతోపాటు వేలాదిగా జనం హాజరై ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రధానంగా పట్టణ ప్రజల కోసం ఆయన చేపట్టిన వివిధ రకాల సేవా కార్యక్రమాలను పదే పదే గుర్తు చేసుకున్నారు. ఆయన అనుచరులు, బంధుమిత్రులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రతాప్‌కుమార్ రెడ్డి భౌతిక కాయం సందర్శించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, ఆయన సతీమణి తనూజా రెడ్డి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మనో ధైర్యం కూడ దీసుకోవాలని కోరారు. ఉదయం నుంచి అంత్యక్రియల వరకూ వారు ప్రతాప్‌కుమార్ రెడ్డి కుటుంబీకుల వద్దే గడిపారు. కిశోర్‌కుమార్ రెడ్డితోపాటు టీడీపీ నాయకులు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, రాజంపేటకు చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి దగ్గుబాటు వెంకటేశ్వరరావు, రాయచోటి ఎమ్మెల్యే తండ్రి గడికోట మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, కృష్ణారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, కోటపల్లె బాబు, పీలేరు, వాల్మీకిపురం, కేవీపల్లె మండల టీడీపీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి, గీతాంజలి, సతీష్‌కుమార్ రెడ్డితోపాటు పలువురు రాజకీయ పార్టీ నేతలు హాజరయ్యారు.

బంధువుల ఇంటికి పంపలేదని బాలుడు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, మే 18: చిన్నచిన్న విషయాలకే మనస్థాపం చెందుతున్న బాల,బాలికలు ఆత్మహత్యకు యత్నిస్తూ వారి తల్లిదండ్రులను కష్టాల్లో నెడుతున్నా రు. అలాంటి సంఘటనే తంబళ్లపల్లె మండలంలో శనివారం చోటుచేసుకుంది. తంబళ్లపల్లె మండలం బలకవారిపల్లెకు చెందిన వెంకటప్ప కుమారుడు(13) కురబలకోటలోని గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో పాఠశాలకు సెలవులు రావడంతో స్వగ్రామంలో వుంటున్నారు. బాలుడు వాల్మీకిపురంలోని తమ బంధువుల ఇంటికి పంపాలని రెండు రోజులుగా మారాం చేస్తున్నా తల్లిదండ్రులు వద్దని వారించారు. దీంతో బాలుడు శనివారం తమ ఇంట్లోనే ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించిన కుటుంబీకులు బాలుడిని ఉరి నుంచి తప్పించి మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

పాముకాటుతో ఇద్దరు రైతులు ఆస్పత్రిపాలు

మదనపల్లె టౌన్, మే 18: మదనపల్లె మండలంలో పొలం పనులు చేసుకుంటున్న ఇద్దరు రైతులు పాముల కాటుకు గురై ఆస్పత్రి పాలయ్యారు. మండలంలోని బొమ్మనచెరువు పంచాయతీ టేకులపాళెంకు చెందిన కళావతి(35) తమ వ్యవసాయ బోరు వద్ద గడ్డి కోస్తుండగా పాము కాటేసింది. కుటుంబీకులు ఆమెను వెంటనే మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అలాగే సీటీఎం గ్రామానికి చెందిన రైతు చంద్రశేఖర్‌రెడ్డి అడ్డగింటివారిపల్లె సమీపంలోని తన పొలంలో పనులు చేస్తుండగా పొదల్లో నుంచి వచ్చిన పాము కాటేసింది. రైతు కేకలకు అక్కడికి చేరుకున్న కుటుంబీకులు అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల చికిత్సతో వీరిద్దరి పరిస్థితి నిలకడగా ఉంది.

టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, మే18: టీడీపీ కార్యకర్తలపై దాడి చేసి గాయపర్చిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె రూరల్ సీఐ సద్గురు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మదనపల్లె మండలం మాలేపాడు గ్రామం పంచాయతీ, ఆవులపల్లెకు చెందిన ఆర్.సుధాకర్, ఆర్.ప్రభాకర్ అనే టీడీపీ కార్యకర్తలను ఆదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త ప్రసాద్ అతని అనుచరులు నలుగురు కలిసి శుక్రవారం సాయంత్రం ఆవులపల్లె సమీపంలో దాడి చేసి గాయపర్చారు. గాయపడిన సుధాకర్, ప్రభాకర్ శనివారం జిల్లాప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందులో దాడి చేసిన ప్రసాద్, వెంకటష్, చక్రపాణి, రమేష్, శ్రీనివాసులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మదనపల్లె రూరల్ సీఐ సద్గురు పేర్కొన్నారు.

రాళ్లతో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

మదనపల్లె అర్బన్, మే18:రాళ్లతో దాడి చేసిన వ్యక్తిని శనివారం స్థానిక గొల్లపల్లె వద్ద అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మండలంలోని పోతబోలు గ్రామం, దిగువగాండ్లపల్లెకు చెందిన సుధాకర్‌కు అదే గ్రామానికి చెందిన వెంకటరమణ సలహాలు ఇచ్చారనే నెపంతో గొడవ పడ్డారు. ఇది మనసులో పెట్టుకున్న వెంకటరమణ ఈ నెల 7వ తేదీన మదనపల్లెకు వచ్చివెళుతున్న సుధాకర్‌పై రాళ్లతో దాడి చేశారని టూటౌన్ ఎస్ఐకి ఫిర్యాదు చేశాడు. దీంతో శనివారం వెంకటరమణపై టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసునమోదు చేసినట్లు తెలిపారు.

తాళ్లవారి వీధిలో మురుగునీరు తొలగించాలి



మురుగునీరు తొలగించాలని నిరసన చేస్తున్న సీపీఐ నాయకులు

మదనపల్లె అర్బన్, మే 18: పట్టణం నడిబొడ్డున ఉన్న తాళ్లవారివీధిలో మురుగునీటిని వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. మురుగునీటి కాలువలు మూసుకునిపోయి మురుగు నిల్వ ఉండడంతో పది రోజులుగా ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఆమేరకు శనివారం మురుగునీరు తొలగించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే మదనపల్లె మున్సిపాలిటీలోని కొన్ని ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇందులో ముఖ్యంగా ప్రశాంత్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్, ఎంఎల్ఎల్ ఆస్పత్రి, బెంగళూరు బస్టాండ్, చిత్తూరుబస్టాండ్, శ్రీకృష్ణా సర్కిల్‌ల్లో అధికంగా నీరు నిల్వ ఉండిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. పటేల్ రోడ్డులోని తాళ్లవారివీధిలో మురుగునీటికాలువ పాడైపోయి మురుగుఅంతా రోడ్డుపై నిలిచిపోయిందని, పదిరోజుల కావస్తున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదని, ఇళ్లలోకి వెళ్లాలంటే మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్నట్లు వారు పేర్కొన్నారు. వెంటనే మురుగు నీటిని తొలగించాలని వారు మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు మురళి, ఎంవీరమణ, ఖాదర్‌బాషా, అంజాద్‌బాషా, బాలాజీ, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం



ప్రభుత్వాస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు



చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్

●తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె టౌన్, మే 18: టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు హెచ్చరించారు. మదనపల్లె మండలం మాలేపాడు పంచాయతీ నల్లరాజుపల్లెకు చెందిన టీడీపీ నాయకులు ప్రభాకర్(30), సుధాకర్(32) అన్నదమ్ములు ద్విచక్ర వాహనంలో చెంబకూరుకు వెళ్లి వస్తుండగా అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ప్రసాద్, వెంకటేశ్, చక్రపాణి, రాజేశ్‌లు పోలింగ్ రోజున టీడీపీకి మద్దతుగా ఎందుకు తిరిగారంటూ దాడికి పాల్పడ్డారు. దీంతో అన్నదమ్ములు ఇద్దరు మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న శ్రీరామ్‌చినబాబు, టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఏ మస్తాన్ ప్రభుత్వాస్పత్రికి చేరుకుని దాడిలో గాయపడిన వారిని పరామర్శించారు. బాధితులకు టీడీపీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలన్నారు. వైసీపీ అరాచకాలకు జూన్ 4వ తేదీన వచ్చే ఫలితాలే అడ్డుకట్ట వేస్తాయన్నారు. వారి వెంట పోతబోలు మాజీ సర్పంచ్ పఠాన్‌ఖాదర్‌ఖాన్, మహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

చంద్రగిరి టీడీపీ అభ్యర్థి నానికి పరామర్శ

మదనపల్లె టౌన్, మే 18: తిరుపతి పద్మావతి యూనివర్సిటీలో వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిని మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ పరామర్శించారు. శనివారం తిరుపతిలో నాని నివాసానికి వెళ్లిన దొమ్మలపాటి, 14వ తేదీన జరిగిన ఘటనపై విస్మయం వ్యక్తం చేశారు. దేవుడి దయతో ప్రాణాపాయం తప్పించుకున్న నానిని కలసి పరామర్శించడం టీడీపీ నాయకుడిగా తన బాధ్యత అన్నారు. ఆయన వెంట దొమ్మలపాటి యశశ్విరాజ్, టీడీపీ మండలాధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు వున్నారు.

మిట్స్‌లో ఏపీఈఏపీ సెట్‌కు 205మంది హాజరు

కురబలకోట, మే 18: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఏపీఈఏపీ సెట్‌కు 205మంది విద్యార్థులకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. శనివారం కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పూర్తైన విద్యార్థులకు ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చర్ ప్రవేశాలను ఈ పరీక్షలను ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు నిర్వహించిన పరీక్షలకు 218 మందికి గానూ 205 మంది హాజరయ్యారన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టామన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలి



కండక్టర్‌కు నగదు బహుమతి అందిస్తున్న మేనేజరు వెంకటరమణారెడ్డి

మదనపల్లె అర్బన్, మే 18: ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. స్థానిక ఆర్టీసీ వన్ డిపోలో బీఆర్ఈ సమావేశంలో బికొత్తకోట మార్గంలోని ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ డిపో పరిధిలో ప్రతి ఒక్క కండక్టర్ పనితీ రును పరిశీలించామని తక్కువ ఆదాయం తెస్తున్న వారికి పెంచడానికి సలహాలు, సూచనలు అందజేశామన్నారు. ఏప్రిల్ మాసంలో బి కొత్తకోట మార్గంలో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన కండక్టర్ బి. అబ్రహంను అభినందిస్తూ నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, రూట్ సూపర్‌వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్ కోసమే బీసీజీ టీకా



వాల్మీకిపురం మండలంలోని గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సనా ఆయేషా

వాల్మీకిపురం, మే 18: టీబీ ముక్త్ భారత్ సాధన కోసమే వయోజన బీసీజీ టీకా కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని వైద్యాధికారి డాక్టర్ సనా ఆయేషా పేర్కొన్నారు. శనివారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి, పీహెచ్‌సీ పరిధిలోని మూరేవాండ్లపల్లెలో నిర్వహిస్తున్న 104 సేవలకు హాజరైన ఆమె వయోజన బీసీజీ టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బీసీజీ టీకా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 16న ప్రారంభించి అర్హులైన లబ్దిదారులకు బీసీజీ టీకాలు ఇవ్వడం జరిగిందన్నారు. టీబీ మరణాల తీవ్రతను నివారించడంలో ఈనెల 23వ తేదీ మూరేవాండ్లపల్లెలోని ఆరోగ్య కేంద్రంలో వయోజన బీసీజీ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మొహ్మద్ రఫీ, ఏఎన్ఎం రెడ్డెమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ వనిత్స్, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి తిరుణాల

మదనపల్లె అర్బన్, మే18:మండలంలోని కట్టుబావిలో చెన్నకశవస్వామి తిరుణాల శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులు ఉదయాన్నే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఉట్లోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

21న నృసింహ జయంత్యుత్సవాలు

రైల్వేకోడూరు, మే 18: రెడ్డివారిపల్లెలోని లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 21న వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పంద్రా నరసింహులు తెలిపారు. 21 నుంచి 23 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. తోమాల సేవలు, అభిషేకాలు, స్వామి వారి కళ్యాణం, గరుడ సేవ తదితర కార్యక్రమా లు ఉంటాయని తెలిపారు.

వాహనదారులు.. ఆదమరిస్తే అంతే

●ప్రమాదకరంగా మారిన వంతెన



కొమ్మిరెడ్డిగారిపల్లి సమీపనంలో కుంగిన వంతెన

నిమ్మనపల్లి, మే 18: మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతి కొమ్మిరెడ్డిగారిపల్లె సమీపంలో వాల్మీకిపురంకు వెళ్లే మార్గంలో ఉన్న వంతెన ప్రమాదకరంగా మారడంత ఎప్పుడు ఏం జరుగుతుందోనని వాహనదారులు భయపడుతున్నారు. నిమ్మనపల్లి నుంచి వాల్మీకిపురంకు మండల ప్రజలు ఇదే మార్గం ద్వారా వంతెన దాటి వెళ్లాల్సి వస్తుంది. అయితే దాదాపు 3ఏళ్ల క్రితం కురిసిన వర్షాలకు బాహుదా నది కింద నిర్మించిన వంతెన రెండుగా చీలి వంతెన మధ్యలో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో అధికారులు గుంతలు ఏర్పడిన చోట చెట్టు కొమ్మలను ఏర్పాటుచేసి మిన్నకుండి పోయారు. దీంతో వాహనదారులు వంతెనను దాటాలంటే భయభ్రాంతులు చెందుతూ ప్రయాణించాల్సి వస్తోంది. బాహుదా ప్రాజెక్టు క్రింద దాదాపు 5గ్రామాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఈ గ్రామస్థులు ఎలాంటి అవసరమేర్పడినా 5కిలోమీటర్ల దూరంలో వున్న నిమ్మనపల్లి లేదా 10కిలోమీటర్ల దూరంలో ఉన్న వాల్మీకాపురంకు వెళ్లాల్సి ఉంటుంది. పైగా ఈ మార్గంలో బస్సు సౌకర్యం లేక పోవడంతో ఎక్కువగా ద్విచక్ర వాహన దారులు ప్రయాణాలు సాగిస్తుంటారు. ప్రజలు ఎక్కువగా భూముల రిజిస్ట్రేషన్ చేసుకొవాలటే వాల్మీకిపురంకు వెళ్లాల్సి ఉంటంది. వంతెన దెబ్బ తిని 3ఏళ్ల కావస్తున్నా పట్టించుకొనే నాథుడు కరువయ్యాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు మూష్టూరు మార్గంలో ఉన్న వంతెన కూడా పూర్తిగా దెబ్బతినింది. వర్షాకాలంలో అయితే బాహుదా ప్రాజెక్టు నిండి నీటిని కిందకు వదిలితే 5గ్రామాల ప్రజలు జలదిగ్బంధలో చిక్కుకొంటున్నారు. ఈ ఏడాదైనా తెగిన వంతెనల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి ప్రజలప్రాణాలను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలు



బి.కొత్తకోట ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు




పీలేరులో అమ్మవారు

బి.కొత్తకోట,మే18: ఆర్య వైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలను బి.కొత్తకోటలో ఆర్యవైశ్యులె శనివారం వైభవంగా జరుపుకున్నారు. స్థానిక వైశ్యబజారు వీధిలో వెలసిన ఆలయంలో వాసవీజయంతి కమిటీ, ఆర్యవైశ్య మహిళామండలి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. అంతకు ముందు హోమం నిర్వహించి భక్తాదులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సాయంత్రం విద్యుత్ దీపాలంకరణతో, పుష్పపల్లకి లో అమ్మవారిని పట్టణ పురవీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో వాసవీ వనితాక్లబ్, మహిళామండలి, ఆర్యవైశ్య యువజన సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీలేరులో: పీలేరు పట్టణం నెహ్రూబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం వేకువజామునే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, హోమం, తులాభారం, ఒడి బియ్యం, మధ్యాహ్నం మహామంగళహారతి, సాయంత్రం పుష్పపల్లకి సేవ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో అమ్మవారికి పుష్పయాగం ఏర్పాటు చేసినట్లు ఆలయ పూజారి చంద్రశేఖర శర్మ తెలిపారు.

పెద్దతిప్పసముద్రంలో: ఆర్యవైశ్య ఆరాధ్య దైవమైన కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంత్యుత్సవాలు పీటీయంలో వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి పీటీయంలోని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేదపండితులు అమ్మవారిని సుందరంగా అలంకరించి గంగాదేవి పూజ, స్వస్తీవాచనం, కలశస్థాపన, నవగ్రహపూజ, పంచామృతాభిషేకం, గణపతిహోమం, నవగ్రహహోమం, మృత్యుంజయహోమం, వాసవీమాత మాల మంత్రం, మహా మంగళహారతి వైభవంగా నిర్వహించారు. అనంతరం రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సుందరంగా అలంకరించి మంగళవాయిద్యాలు, ఆర్య వైశ్య మహిళలు కరఙ్పూర హారతుల నడుమ పట్టణ పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు, మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ములకలచెరువులో: ములకలచెరువు, చౌడసముద్రంలలో శనివారం వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వాసవీమాత



పీటీయంలో ఊరేగుతున్న వాసవి అమ్మవారు


సింహవాహనంపై దర్శనమిచ్చిన శ్రీనివాసుడు



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరుడు

మదనపల్లె అర్బన్, మే 18: దేవళంవీధిలోని ప్రసన్నవెంకటరమణస్వామి ఆలయంలో వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం సింహవాహనంపై శ్రీనివాసుడు ఊరేగి భక్తులకు దర్శనమిచ్చాడు. అలాగే కమ్మవీధిలో హనుమద్ వాహనంపై నెహ్రూ బజార్, త్యాగరాజవీధి, గుండ్లూరువీధి, రాఘవేంద్రరావువీధి, దేవళంవీధిల్లో ఆలయ ఈవో రమణ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వ హించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పిఅభిషేకాలు, విశేషపూజల అనంతరం పత్ర్యేకంగా అలంకరించా రు. అంతకముందే ఆలయంలో హోమం జరిపించారు. పూజా కార్యక్రమంలో అధిక సం ఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, మే 18:గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆల యంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తుల ను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామికి ..



కలకడ, మే 18:మండలంలోని బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి విశేష పూజలను చేశారు. ఈ సందర్భంగా వేకువ జామునే స్వామి వారి అభిషేకం, ఆకుపూజ కార్యక్రమాలను పూజారి రామయ్య నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యలో భ క్తు లు స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నేటి నుంచి ఉలవల గంగమ్మ జాతర

పీలేరు, మే 18: పీలేరు మండలం తలపుల పంచాయతీలోని ఉలవల గంగమ్మ జాతర ఆదివారం నుంచి మంగళవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జె.వెంకటరమణనాయుడు తెలిపారు. ఈ మేరకు పీలేరు పట్టణంతోపాటు తలపుల గ్రామంలో శనివారం చాటింపు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉలవల గంగమ్మను పీలేరు మండలంతోపాటు ఎర్రావారిపాళెం మండలంలోని పలు ప్రాంతాల ప్రజలు కులమతాలకు అతీతంగా పూజిస్తుంటారని తెలిపారు. ఈ నెల 19 (ఆదివారం) నుంచి 21వ తేదీ (మంగళవారం) వరకు ప్రత్యేక పూజలతో జాతరను నిర్వహించనున్నట్లు తెలిపారు.

నల్లవీర గంగాభవాని జాతరకు ఏర్పాట్లు పూర్తి



వాల్మీకిపురంలోని నల్లవీరగంగాభవానీ అమ్మవారి ఆలయం ముస్తాబైన నల్లవీరగంగాభవానీ అమ్మవారు

వాల్మీకిపురం, మే 18: వాల్మీకిపురం పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపాన వెలసిన నల్లవీర గంగాభవానీ అమ్మవారి జాతర ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం నుంచి జాతర మహోత్సవాలకు చాటింపుతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజల అనంతరం మహిళలు జల కళశాలతో ఊరేగింపుగా బయలుదేరి పట్టణంలోని బజారువీధి, నాయక్ వీధులలో గల గంగరాళ్లకు జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరగనున్నాయి. వారం రోజుల పాటు జాతర మహోత్సవాలు జరుగనున్నాయి. ఈనెల 26న అమ్మవారికి దీలు, బోణాలు సమర్పణ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. అదే రోజు అమ్మవారి నగరోత్సవం, భక్తులకు అన్న, ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, కమిటీ సభ్యులు తెలియజేశారు.